


# విజయభాను




హైదరాబాద్, శనివారం 14-10-2017 VIJAYABHANU DAILY HYDERABAD EDITION సంపుటి : 37 సంచిక : 31 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### రవాణా నౌక మునక ...
## 11 మంది భారతీయ సిబ్బంది గల్లంతు...



టోక్యో : ఫిలిప్పైన్స్‌లో టైఫూన్ కల్లోలం సృష్టిస్తోంది. పసిఫిక్ సముద్రంలో శుక్రవారం కార్గో షిప్ మునిగిపోయింది. దీంతో దీనిలోని 11 మంది భారతీయ సిబ్బంది అదృశ్యమయ్యారు. జపాన్ కోస్ట్‌గార్డ్ తెలిపిన వివరాల ప్రకారం ఎమరాల్డ్ స్టార్ నౌక 26 మంది భారతీయ సిబ్బందితో వెళ్తోంది. శుక్రవారం ఫిలిప్ఫైన్స్ ఉత్తర దిశ నుంచి తూర్పువైపు ప్రయాణిస్తూ 280 కిలోమీటర్ల దూరంలో ఉన్నపుడు అపాయంలో ఉన్నట్లు జపాన్ కోస్ట్‌గార్డ్‌కు సంకేతాలు తరువాయి 2లో

## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్



హైదరాబాద్: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టుకు హాజరవుతున్నారు. కాగా... నవంబర్ 2వతేదీ నుంచి తాను తాను పాదయాత్ర చేపడుతున్న దృష్ట్యా వ్యక్తిగత హాజరు నుంచి 6 నెలలు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై ప్రస్తుతం విచారణ జరగుతోంది.

ఇదిలా ఉండగా జగన్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వవద్దంటూ సీబీఐ న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. ప్రస్తుతం దీనిపై విచారణలు జరుగుతున్నాయి.

### నిషేధానికి మతం రంగు పులమడం
# అత్యంత బాధాకరం



దిల్లీ: బాణసంచా నిషేధానికి మతం రంగు పులమడం బాధాకరంగా ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్యాన్ని నివారించేందుకు దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో బాణసంచా వినియోగంపై నిషేధం విధిస్తూ సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సామాజిక మాధ్యమాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు కావాలనే హిందువుల పండగలను లక్ష్యంగా చేసుకొని ఈ నిషేధం విధించినట్లు వ్యాఖ్యలు చేశారు. దీనిపై న్యాయస్థానం విచారం వ్యక్తం చేసింది. నిషేధం విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకునే యోచన లేదని స్పష్టం చేసింది. దీపావళి ముగిసిన తర్వాత కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని తదుపరి ఆదేశాలు ఇస్తామని న్యాయస్థానం వెల్లడించింది. అప్పటి వరకూ నిషేధం కొనసాగుతోందని పేర్కొంది.

దిల్లీలో గతేడాది బాణసంచాపై విధించిన నిషేధాన్ని పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిన విషయం తెలిసిందే. నవంబర్ 1 వరకు ఈ నిషేధం కొనసాగుతుందని న్యాయస్థానం వెల్లడించింది. కోర్టు తీర్పుతో దిల్లీలో బాణసంచా విక్రయాలను నిలిపివేశారు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో పెద్దమొత్తంలో బాణసంచా ఉపయోగిస్తుండటంతో తీవ్ర వాయు, శబ్దకాలుష్యం ఏర్పడుతోందని, దీని వల్ల ప్రజలు తీవ్ర తరువాయి 2లో


### కష్టపడి సాధించుకున్న రాష్ట్రం..
## ఇష్టపడి అభివృద్ధి చేస్తా

- ఏ ఒక్కప్రాంతంపైనా నాకు పక్షపాతం లేదు
- కాళేశ్వరం నీళ్లతో నల్లగొండ సస్యశ్యామలం
- సూర్యాపేట బహిరంగసభలో సీఎం కేసీఆర్




నల్లగొండ: కాళేశ్వరం ప్రాజెక్టును ఎవరూ ఆపలేరని, లక్షమంది అడ్డొచ్చినా కట్టి తీరుతమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉద్ఘాటించారు. తెలంగాణ లోని ప్రతి ఇంచుకూ న్యాయంచేస్తానని ఆయన స్పష్టంచేశారు. ఆనాటి కాంగ్రెస్ తరువాయి 2లో

### శబరిమలపై రాజ్యాంగ ధర్మాసనానిదే
## తుది తీర్పు



న్యూఢిల్లీ: శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించాలా లేదా అన్న అంశాన్ని ఇక రాజ్యాంగ ధర్మాసనం తేల్చనున్నది. ఈ విషయాన్ని ఇవాళ సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. శబరిమలలో మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధం పట్ల వేసిన పిటిషీన్‌ను ఇవాళ సుప్రీంకోర్టు విచారించింది. అయితే ఆ అంశాన్ని అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి రెఫర్ చేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఆర్.భానుమతి, అశోక్ భూషన్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. శబరిమల అంశంపై రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే తీర్పును ఇవ్వగలదు అని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. మహిళల నిషేధం అంశాన్ని వాళ్లు మాత్రమే తేల్చగలరని కోర్టు పేర్కొన్నది. మహిళలకు ప్రవేశం కల్పించకపోవడం అంటే.. అది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడం అవుతుందా అన్న కోణంలోనూ ధర్మాసనం తీర్పు ను వెలువరించే అవకాశాలున్నాయి. అయ్యప్ప స్వామి కొలువుదీరిన శబరిమల ఆలయంలోకి పదేళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న ఆడవాళ్లకు ప్రవేశం లేదు. అయితే రాజ్యాంగం ప్రకారం అలాంటి నిషేధాన్ని కొనసాగించలేమని గతంలో కోర్టు ప్రశ్నించింది.

## రాజకీయాల్లో గెలవడం ముఖ్యం కాదు
### రజనీ వ్యాఖ్యలపై కమల్ స్పందన



చెన్నై: రాజకీయాల్లో గెలవడం ఒక్కటే ముఖ్యం కాదని అంటున్నారు ప్రముఖ నటుడు కమల్ హాసన్. కమల్ నవంబర్ నెలలో కొత్త పార్టీని పెట్టే యోచనలో ఉన్నారు. దీనిపై ఇటీవల సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పందిస్తూ.. గతంలో ప్రముఖ నటుడు శివాజీ గణేశన్ పార్టీ పెట్టి సొంత నియోజక వర్గంలోనే ఓడిపోయారు. డబ్బు, హోదాతో రాజకీయాల్లో గెలవలేం. అంతకంటే ఎక్కువే ఉండాలి. దీని గురించి కమల్‌హాసన్‌కి బాగా తెలుసు. అన్నారు.

రజనీ వ్యాఖ్యలపై కమల్ హాసన్ ఓ మ్యాగజిన్‌లో రాసిన ఆర్టికల్ ద్వారాస్పందించారు. రాజకీయాల్లో గెలవడం ఒక్కటే ముఖ్యం కాదని అన్నారు. రజనీ వ్యాఖ్యలపై సమాధానం చెప్పడానికి ఆయనకే నేరుగా ఫోన్ చేయొచ్చుగా అని ప్రజలు నన్ను అడగొచ్చు. మా స్నేహానికి అలాంటి క్లారిటీలు ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. మా స్నేహం అంతకంటే ఎక్కువ. ఇది చాలా మందికి అర్థం కాదు. రాజకీయాల్లో అసలైన గెలుపుఅంటే ఏంటి? ఓ కొత్త పార్టీ పెట్టి అభ్యర్థులను ఎంపిక చేసుకుని మెజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి అయిపోవడమా?

అదే గెలుపైతే ప్రజల నమ్మకాన్ని పోగొట్టకుండా వారికి మంచి చేయడం కూడా గెలుపే. కొన్నేళ్ల క్రిత్రం పార్టీ పెట్టి గెలిచినవారు కూడా ప్రజలకు ఆరోగ్యం, విద్య పరంగా ఎలాంటి అభివృద్ధి చేయలేదు.

రాజకీయ చరిత్రలో మనం గుర్తుపెట్టుకోవాల్సింది కేవలం అంబేడ్కర్‌ని మాత్రమే. అనిపేర్కొన్నారు కమల్.ఖ

## కంచ ఐలయ్య పుస్తకంపై సుప్రీం కోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: కంచ ఐలయ్య రాసిన కోమట్లు సామాజిక స్మగ్లర్లు పుస్తకాన్ని నిషేధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. కంచె ఐలయ్య పుస్తకం ఓ వర్గాన్ని కించపరిచేలా ఉందని వీరాంజనేయులు అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు.

పుస్తకాన్ని నిషేధించడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకున్నట్టేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రచయితకు చట్టపరిధిలో భావాలను వ్యక్తపరిచే అవకాశముందని, గతంలోనూ పుస్తకాల శీర్షికలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని సుప్రీంకోర్టు గుర్తు చేసింది.




### టేకిట్-ఈజీ



ఇటువంటివెన్ని చేసినా... మనం కాదు... మృగాళ్ళే నిర్భయంగా ఉన్నారు !!

### రెండు గంటలు.. ఆరు కార్యక్రమాలు
## శంకుస్థాపనలు..కలెక్టరేట్, ఎస్పీ భవనాలకు భూమిపూజ

సూర్యాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట జిల్లా పర్యటనలో రూ.880 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మధ్యాహ్నం 3:36గంటలకు హెలికాప్టర్ ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కుడకుడ రోడ్డులో కలెక్టరేట్ కార్యాలయానికి, ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రగతిరథంలో రోడ్డుమార్గంలో బయలుదేరి చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ వద్ద రూ.650కోట్ల వ్యయంతో నిర్మించిన 400కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. తరువాత చందుపట్ల వద్ద నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును ప్రారంభించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని మూడు మండలాలు, 60గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే ఈ పథకాన్ని ప్రజలకు అంకితంచేశారు. నల్లా తిప్పి చందుపట్ల గ్రామానికి చెందిన మహిళా వార్డు సభ్యులకు నీటి బిందెలను సీఎం అందించారు.

అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకొని కేసీ గుప్తా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత 22వ వార్డులోని యాదవ్‌బజారులో రూ.11కోట్లతో నిర్మించిన 192డబుల్ బెడ్రూం అపార్ట్‌మెంట్ సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. 5:40గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి నివాసానికి చేరుకొని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. తిరిగి 6:30గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సూర్యాపేట ప్రగతి నివేదిక బహిరంగసభలో ప్రసంగించారు. ఆయా కార్యక్రమాల్లో సీఎం వెంట మంత్రులు జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ స్పీకర్ నేతి విద్యాసాగర్, జెడ్పీ చైర్మన్ బాలూనాయక్, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, వేముల వీరేశం, నల్లమోతు భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు సమాజానికి మార్గదర్శకులు





బ్రహ్మపుర : వృద్ధులు సమాజానికి మార్గ దర్శ కులని, వారు నవ్వితే సమాజం నవ్వుతుందని, వారి ఆశీస్సులు చిన్నారుల జీవితాలను సుఖమయం చేస్తా యని అతిథులు అన్నారు. రాష్ట్ర సామాజిక భద్రత, దివ్యాంగుల శక్తీకరణ విభాగం ఆధ్వర్యంలో బ్రహ్మ పుర సబ్‌డివిజనల్ స్థాయి వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా సన్మానోత్సవాలు జరిగాయి. స్థానిక టౌన్ హాల్లో జరిగిన వేడుకల్లో చేనేత, హస్తకళలు, పాత్రికేయ రంగం, పచ్చదనం, వ్యవసాయం, ఉద్యానవనం, జానపద కళలు, క్రీడలు, నాటకం తదితర రంగాల్లో ప్రతిభావంతులైన పదిహేను మంది వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇత్తడి నమూనాల తయారీదారుడు సందక ఆనందరావు, పచ్చదనం కోసం కృషి చేస్తున్న ఈపరి కృష్ణారావు, బ్రహ్మపుర పట్టు చేనేత కార్మికుడు బనిశెట్టి సత్యం, సీనియరు పాత్రికేయుడు సునీల్ పట్నాయక్ తదితరులను సన్మానించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి సూర్యనారాయణ పాత్ర్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిథులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు విజయ అమృత కుళంగె, బ్రహ్మపుర సబ్‌కలెక్టరు సిద్ధార్థ శంకర స్వయిన్, ఉద్యాన శాఖ గంజాం ఉపసంచాలకుడు భగవాన్ దాస్, బ్రహ్మపుర తహసీల్దారు రంజిత్ కుమార్ పరిడా, వైద్య నిపుణుడు పి.సి.సాహు తదితరులు పాల్గొని మాట్లాడారు. చివరిగా సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. గానం, హాస్యం, ఒడిస్సీ, సంబల్ పురి తదితర ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

# కేసీ రెడ్డి సేవలు శ్లాఘనీయం

బెంగళూరు : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి దివంగత కె.సి.రెడ్డి విగ్రహాన్ని విధానసౌధ ముందు ఏర్పాటు చేయాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.వి.రాజశేఖరన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మైసూరు చలో ఉద్యమానికి 71 ఏళ్లు గడిచిన నేపథ్యంలో బెంగళూరు మౌర్య కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ప్రసం గించారు. ఆంగ్లేయులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లినా.. మైసూరు ప్రభువులు తమ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు అంగీకరించలేదన్నారు. ఆ సమయంలో కేసీరెడ్డి నేత ృత్వంలో మైసూరు చలో ఉద్యమం కొనసాగడాన్ని గుర్తు చేశారు. సుదీర్ఘంగా పోరాటం చేశాకే మైసూరు సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. ఆ పోరాట స్ఫూర్తి ప్రదాత ఉద్యమ నిర్మాత కె.సి.రెడ్డి దేశ సేవ వెలకట్టలేనిదన్నారు. కర్ణాటక తొలి ముఖ్య మంత్రిగా బాధ్యతలు నిర్వహించి అనం తరం జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించారని గుర్తు చేశారు.

ఆయన విగ్రహాన్ని విధానసౌధ ముందు నేటికీ ఆవిష్కరించకపోవడం శోచనీయ మన్నారు.

కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు వాటాళ్ నాగరాజు, ప్రముఖులు వసంత కవిత, రామ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# తీరప్రాంత భద్రతకు మరిన్ని చర్యలు



రాయగడ : రాష్ట్రంలో తీరప్రాంత భద్రత మెరుగుపై రాష్ట్ర ప్రభుత్వం ద ృష్టిసారిస్తోంది. తీరప్రాంత మెరుగు పునరుద్ధరణ డ్రైవ్‌లో భాగంగా మత్స్యకారులకు జలనిరోధిత (వాటర్ ప్రూఫ్) బయోమెట్రిక్ కార్డులను మంజూరు చేయనుంది.

ఈ ఏడాది ముగింపు నాటికల్లా అందుకు సంబంధించి ప్రక్రియను పూర్తిచేయ నుంది. ఆ దిశగా చర్యలు వేగవంతం చేయాలని మత్స్యశాఖకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదిత్య ప్రసాద్‌పాఢి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి తీరప్రాంత భద్రత కమిటీ సమా వేశంలో ఈ మేరకు నిర?యం తీసు కున్నట్లు సమాచారం.

3.46 లక్షల మందికిపైగా గుర్తింపు

జాతీయ జనాభా రిజిష్టర్(ఎన్‌పీఆర్), హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ, మత్స్యశాఖ సంయు క్తంగా చేపట్టిన సర్వే ప్రకారం రాష్ట్రంలో దీనికోసం 3,46,948 మంది మత్స్యకారులను గుర్తించినట్లు నివేదిక చెబుతోంది. వీరిలో బయోమెట్రిక్ కార్డుల కోసం ఇప్పటికే 3,45,649 మంది నుంచి వేలిముద్రలు, ఫొటోలు సేకరిం చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) ఈ గుర్తింపు కార్డులను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

1620 కొత్త బోటులకు రిజిస్ట్రేషన్

ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 1620 కొత్త బోటులకు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు వెల్లడిం చడం గమనార్హం. అదే గతేడాదిలో ఈ సంఖ్య 22,289గా ఉన్నట్లు స్పష్టం చేసింది. వీటిలో మోటారు సంబంధిత, మోటారు లేని, పరిక రాలున్న రకాలకు చెందిన చేపలు పట్టే బోటు లుగా ఉన్నట్లు ఆ శాఖ పేర్కొంది.

# అన్నా పేరుతో భాజపా రాజకీయాలు: స్టాలిన్

చెన్నై : అన్నా పేరుతో రాజకీయాలు చేసే స్థితికి భాజపా వచ్చిందని డీఎంకే కార్య నిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ పేర్కొన్నారు. అన్నా అరివా లయంలో విలేకరు లతో ఆయన మాటా ్లడుతూ.... రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపా ధ్యాయులు, ఫించన్‌దారులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పలు పోరాటాలు చేస్తున్నారని తెలపారు. ప్రభుత్వానికి ఈ విషయాలు పట్టడం లేదని ఆరోపించారు. అన్నామలై విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ నుంచి జీతాలు కూడా ఇవ్వలేదని తెలిసిం దన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డెంగీ మొదలగు అనేక సమస్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని పేర్కొన్నారు. జయలలిత ఉన్నప్పుడు 110 నిబంధన కింద ప్రకటించిన పథకాల గురించి కూడా శ్వేత పత్రం విడుదల చేయాలని కోరామని గుర్తుచేశారు. వీటిపై స్పందించిన తీరుతోనే రాష్ట్ర ప్రభుత్వ పని తీరు వెల్లడ్కొందని పేర్కొన్నారు. శ్వేతపత్రాలు విడుదలైతేనే అన్ని నిజాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. భాజపా నాయకుడు మురళీధరరావు వ్యాఖ్య లను ఉద్దేశిస్తూ అన్నా పేరుతో రాజకీయాలు చేసే స్థితికి భాజపా వచ్చిందన్నారు. అన్నాను గుర్తు చేసినందుకు డీఎంకే తరఫున ఆయన కృతజ్ఞతలు చెబుతున్నట్లు స్టాలిన్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలోని భాజపా ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు.


# చేనేత కార్మికులకు సౌరదీపాలు

భువనేశ్వర్ : రాష్ట్ర ప్రభుత్వం ఇక చేనేత కార్మికులకు ఉచితంగా సౌర దీపాలు ఇస్తుందని రాష్ట్ర జౌళి శాఖ మంత్రి స్నేహంగిని చురియా తెలిపారు. భువనేశ్వర్‌లో ఈ దీపాల విని యోగంపై చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వస్త్రాలు నేసే సమయంలో ఈ దీపాలు ఉపయోగపడతాయని వివరించారు. విద్యుత్తు ఖర్చు తగ్గించేందుకు, పనిలో ఆటంకం లేకుండా ఉండేందుకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. గ్రీన్‌కో ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ సౌర దీపాలు అందజేస్తుందని చెప్పారు. దీనిని ఒకసారి ఛార్జ్ చేస్తే 12 గంటల వరకు పనిచేస్తుం దన్నారు. తొలి విడతలో వెయ్యి మందికి వీటిని అందిస్తామన్నారు. అనంతరం మిగిలిన వారికి కల్పిస్తామని పేర్కొన్నారు.

## కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని పాదయాత్ర

బ్రహ్మపుర : కంటి ఆరోగ్యం పట్ల అప్రమత్తతతోపాటు నేత్రాలు ఎంత ముఖ్యమైనవన్నది విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వారి కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టి పాదయాత్ర నిర్వహించారు. గంజాం జిల్లా అస్కా పట్టణంలోని ఆర్యన్ పబ్లిక్ స్కూలు ఆధ్వర్యంలో సమరఝోలోని శంకర కంటాసుపత్రి, అస్కా లయన్స్ క్లబ్‌ల సహకారంతో ఉదయం విద్యార్థులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అస్కా పట్టణంలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఆర్యన్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు నేత్రాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు సూచనలు చేశారు. తర్వాత 103 మంది పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో 23 మంది విద్యార్థులు నేత్ర సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసిందని శంకర కంటాసుపత్రి క్యాంపు మేనేజరు నళినీకాంత రౌత్ సాయంత్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు సంచాలకుడు అబ్నీత్ గంభీర్, ప్రధానాచార్యుడు సరోజ్‌కుమార్ పట్నాయక్, అస్కా లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.కిశోర్‌కుమార్ సేనాపతి, పి.ప్రదీప్ పాత్ర్, డి.మోహన్ తదితరులతోపాటు పాఠశాల సిబ్బంది, క్లబ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయం మూసివేత తగదు




బళ్లారి : కె.ఎస్.ఒ.యు. విశ్వవిద్యాలయాన్ని మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏబీవీపీ చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావడానికి సహకరించాలని కోరుతూ బళ్లారి ఏబీవీపీ విద్యార్థులు నగరంలో ఆందోళన చేపట్టారు. అద నపు జిల్లా అధికారి సోమశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏబీవీపీ జిల్లా సంచాలకుడు సంతోష్‌రావు, పథాధికారులు దినేష్, శ్రీకాంత్, పునీత్, శివారెడ్డి, అక్షయ్, బిందుమాధవి, ప్రియాంక, శశికళా నేతృత్వంలో స్థానిక దుర్గమ్మ దేవస్థానం నుంచి జిల్లా అధి కారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 1996 వరకు కె.ఎస్.ఒ.యు. మైసూరు విశ్వవిద్యాలయం పరిధిలో ఉండేది. విశ్వవిద్యాలయంలో పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కె.ఎస్.ఒ.యు. విశ్వవిద్యాలయాన్ని మూసివేయాలని నిర?యం తీసుకోవడం సరికాదన్నారు.

ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ రాయరెడ్డి యు.జి.సి. అనుమతితో దీన్ని తెరిపించాలని కోరుతూ ఏబీవీపీ విద్యార్థులు మైసూరులో ఈ నెల 9న పాదయాత్ర ప్రారంభించారు.

# అభివృద్ధి పనులను బీఎమ్సీ తరపునే చేయించాలి



బ్రహ్మపుర : బీఎమ్సీలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివ ృద్ధి పనుల్లో బిజద కార్పొరేటర్లను భాగస్వామ్యం చేస్తున్నారని, మంజూరవుతున్న కేంద్ర, రాష్ట్ర నిధులను అన్ని వార్డుల్లో పనులకు వినియోగించాలని కాంగ్రెస్, భాజపా కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు బీఎమ్సీ కమిషనర్ నిఖిల్ పవన్‌కల్యాణ్‌ను కార్పొరేటర్లు కలిసి మాట్లాడారు. పనులు, మంజూరవుతున్న నిధులపై చర్చించారు. ఈ సందర్భంగా నాలుగో వార్డు కార్పొరేటరు అనిల్‌నాయక్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యుడు చ్యవుపట్నాయక్ ముఖ్యమంత్రి, కేంద్రం నిధులను బిజద కార్పొరేటర్లకు ఇచ్చి వారితో పనులు చేయించేలా చూస్తున్నారని, అలా కాకుండా మంజూరవుతున్న నిధులను అన్ని వార్డుల్లో వినియోగించేలా చూడాలని కమిషనర్ ద ృష్టికి తెచ్చారు. నిధులు మంజూరైన వెంటనే బీఎమ్సీ మండలి సమవేశంలో తీర్మానం చేసిన తర్వాత ఓపెన్ టెండర్ ద్వారా పనులు చేయించాలని కార్పొరేటర్లు డిమాండు చేశారు. దీనిపై కమిషనర్ పవన్ కల్యాణ్ మాట్లాడుతూ బీఎమ్సీలో జరుగుతున్న పనులు ఎవరి ప్రమేయంతో జరుగు తున్నాయి, ఏయే నిధులతో ఏయే పనులు జరగుతున్నాయన్న దానిపై పరిశీలిస్తానని చెప్పారు. బీఎమ్సీ ప్రజాపనులు విభాగం అధికారులు క్షేత్రస్థాయి పనుల పరిశీలనకు వెళ్లేటప్పుడు వారు ముందుగా కార్యాలయంలో తెలియపరిచి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు అనిల్‌నాయక్, బి.శ్రీనివాస్, ప్రియాంక చౌదురి, గీతా మాథెయి, మినతి బిశోయి, సంజుక్తా పాత్రో, ఝిల్లిబెహెరా, భాజపా కార్పొరేటరు నమిత పండాలు కమిషనర్‌ను కలిసి పనులు అన్ని వార్డుల్లో పనులు పక్షపాతం లేకుండా సమానంగా జరిగేలా చూడాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

## రవాణా నౌక మునక ... 11 మంది భారతీయ సిబ్బంది గల్లంతు...

పంపించింది. ఇదే ప్రాంతంలో ప్రయాణిస్తున్న మూడు నౌకలు ప్రమాదంలో ఉన్న ఎమరాల్డ్ స్టార్ నుంచి 15 మందిని కాపాడగలిగాయి. కానీ 11 మంది గల్లంతయ్యారు. 33.205 టన్నుల ఎమరాల్డ్ స్టార్ మునిగిపోయింది. ఈ నౌక హాంగ్‌కాంగ్‌లో రిజిస్టర్ అయింది. రెండు గస్తీ పడవలను, మూడు విమానాలను రంగంలోకి దించినప్పటికీ వీరిని కాపాడేందుకు అవకాశం చిక్కడం లేదు. టైఫూన్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

## నిషేధానికి మతం రంగు పులమడం

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ గతేడాది నవంబర్‌లో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బాణసంచాపై నిషేధం విధించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది.

తాజాగా ఈ నిషేధాన్ని తిరిగి కొనసాగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అటు కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ కూడా పిటిషనర్లకు మద్దతు తెలిపింది. దీంతో సుప్రీంకోర్టు గతంలో చేసిన నిషేధాన్ని పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించింది.

## కష్టపడి సాధించుకున్న రాష్ట్రం.. ఇష్టపడి అభివృద్ధి చేస్తా

పాలకుల అసమర్థత వల్లే దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, పాలమూరు జిల్లాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. కాకలు తీరిన ఇంజినీర్లే ఆశ్చర్యపోయేలా నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నామని.. నల్లగొండ జిల్లాలోని సాగర్ ఆయకట్టు సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి సూర్యాపేట జిల్లా నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల భవనాలకు శంకుస్థాపనలు చేశారు. డబుల్ బెడ్రూం అపార్ట్‌మెంట్లు, మిషన్ భగీరథ, 400కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సహా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జూనియర్ కాలేజీ మైదానంలో మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రగతిసభలో ప్రసంగించారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

చెప్పినవన్నీ చేసినం

సరిగ్గా మూడున్నరేండ్ల కిందట ఆగమేఘాల మీద వందకిలోమీటర్ల స్పీడ్‌లో వచ్చి ఇదే సూర్యాపేట సభల మాట్లాడిన.. ప్రతిస్పందనగా మీరు జగదీశ్‌రెడ్డిని గెలిపించిన్రు. అనాడు చెప్పుకున్నట్టు వందకు వందశాతం తెలంగాణ సాధించుకున్నం. తెలంగాణలో అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఏం చెయ్యాల్నో టీఆర్‌ఎస్‌కు తెలిసినంతగా మరెవ్వరికీ తెల్వదు. సాధించుకున్న స్వరాష్ట్రంల పరిపాలన వికేంద్రీకరణకోసం చాలా జిల్లాలుగ చేసుకోవాల్సిన అక్కరుండె. మొట్టమొదటి ప్రాధాన్యంలో సూర్యాపేట జిల్లా చేస్త అని చెప్పిన. వంద శాతం జేసి అప్పగించిన. జగదీశ్‌రెడ్డిని గెలిపిస్తే మామూలు ఎమ్మెల్యేగా ఉండరని చెప్పిన.. గత మూడున్నరేండ్లుగా ఆయన రాష్ట్రమంత్రిగా సేవలందిస్తున్నరు. చెప్పిన మాటలన్నీ చేసినం.

ఎత్తు, దొడ్డున్న పాలకులతో ఒరిగిందేమీ లేదు

ఉమ్మడి నల్లగొండ జిల్లా చైతన్యంలో ముందు నిలిచిన జిల్లా. పోరాటాల ఖిల్లా. కానీ ఏం జరిగింది? ఏమీ జరుగలేదు. మనుషులు గెలువలేదా? మంత్రులు కాలేదా? ఎత్తు తక్కువున్నరా? దొడ్డు తక్కువున్నరా? అంటే.. అదేం లేదు. ప్రజలకు ఒరిగింది ఏంది? ఫ్లోరైడ్ యాత్ర పేరుతో ఎనిమిది రోజులు జిల్లాలో తిరిగిన. వివిధ ప్రాంతాల్లో పండుకున్న. ఏడ్సిన కొన్నిచోట్ల. మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో కండ్లకు నీళ్లు తీసుకొన్నం. సమస్య పరిష్కారం కాలే. పోరాటాలు చేసినం. ఎవ్వరూ పట్టిచ్చుకోలే. సమస్యలు మిగిలిపోయినయి. సమైక్యవాదులు ఆనాడు మనకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో మోసం చేసిన్రు. ఒరిజనల్ పేరు నాగార్జునసాగర్ కాదు. దాని పేరు నందికొండ ప్రాజెక్టు. కట్టుకోవాల్సింది ఇప్పుడున్న కాడ కాదు. 19 కిలోమీటర్ల పైన ఏలేశ్వరం దగ్గర కట్టాల్సి ఉండె. ఆరోజు దగా జరిగింది. మోసం జరిగింది. ఏలేశ్వరం దగ్గర్నే కట్టి ఉంటే నల్లగొండ మొత్తానికి నీళ్లొచ్చేది. 10లక్షల ఎకరాలు పారేది. దగా జరుగడానికి హైదరాబాద్ స్టేట్ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, బూర్గుల రామకృష్ణారావే కారణం. చాలా పెద్దమోసం జరిగింది. 180 టీఎంసీలు తెలంగాణకు.. 60 టీఎంసీలు ఆనాటి మద్రాస్‌రాష్ట్రానికి అని నిజాం ప్రతిపాదించారు. ఫౌండేషన్ నాటికి మీకు 132.. మాకు 132 అన్నరు. ఫైనల్‌గ మళ్లీ 25 టీఎంసీలు కట్‌చేసి నందిగామ, జగ్గయ్యపేటను కలిపిన్రు. ఆ నీళ్లయిన సరిగ్గా ఇస్తరా? ఇయ్యరు! ఎడమకాల్వ మీద కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేసిన. సాగర్‌లో మాకు మొదటికే అన్యాయం జరిగింది. కుడి కాల్వ లిఫ్టుల నిర్వహణ ఖర్చులేమో ప్రభుత్వమే భరిస్తది. ఎడమ కాల్వ మీద రైతులే బిల్లులు కట్టాలె. ఇదేం న్యాయం? అని ఆ రోజు ముఖ్యమంత్రిని అడిగిన. తర్వాత వెంటనే ఇరిగేషన్ మంత్రి జీవో ఇస్తున్నం.. మేమే బిల్లు కడ్తం అని చెప్పిండు. ఆనాటి కాంగ్రెస్ నాయకులు ఏం చేయలేదు. ఏం ఆలోచన జేయలేదు.

వెనుకబాటుకు కాంగ్రెస్ నేతలే కారణం

దక్షిణ తెలంగాణలో పాలమూరు, నల్లగొండ నిర్లక్ష్యానికి గురైన జిల్లాలు. అన్నిరకాలుగా దగాపడ్డ జిల్లాలు. కరెంటు ప్రాజెక్టులు మొత్తం ఉత్తర తెలంగాణల్నే పెట్టిన్రు. కొత్తగూడెం నుంచి రామగుండం వరకు గోదావరి ఒడ్డున్నే పెట్టింద్రు. పవర్ బ్యాలెన్స్ కావాలె. 23జిల్లాల రాష్ట్రంల గూడ అన్ని జిల్లాల కంటే అత్యధికంగా విద్యుత్ కనెక్షన్లున్న జిల్లా నల్లగొండ. పరిశ్రమలు గూడా సరైన పద్ధతిలో రాలేదు. అందుకోసం ఈరోజే 400కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించుకున్నం. 60ఏండ్ల చరిత్రలో ఏ ముఖ్యమంత్రి, ఏ నాయకుడూ చేయని విధంగా రూ.24,950 కోట్లతో భారతదేశంలోనే మొట్టమొదటి అల్ట్రా మెగా పవర్‌ప్లాంట్ యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని దామరచర్ల వద్ద నిర్మిస్తున్నం. ఏడాది, ఏడాదిన్నరలో ఉత్పత్తి ప్రారంభిస్తది. దాంతో నల్లగొండ జిల్లా స్వరూపమే మారుతది. అద్భుతమైన వెలుగు వస్తది. రామగుండంలో ఎన్టీపీసీ 2700 మెగావాట్లు ఉత్పత్తి చేస్తేనే ఆ పట్టణం రూపు మారిపోయింది. ఇక్కడ నాలుగు వేల మెగావాట్లు.. అదికూడా ఎన్టీపీసీ కాదు.. మన జెన్‌కో సొంతం. సౌత్ ఇండియాలో నంబర్‌వన్.. నేనే కొట్లాడి పెట్టించిన.

పోతిరెడ్డిపాడు పొక్క పొడుస్తుంటే నోరు తెర్వలేదు..

వర్షాకాలం వచ్చింది. సాగర్ కింద కొంత, బోర్ల కింద కొంత సాగుచేసిన్రు. సాగర్ మొత్తం నిండలే. ఇప్పుడిప్పుడే నీళ్లొస్తున్నయ్. నిండాలని భగవంతుణ్ని ప్రార్థిద్దాం. కానీ ఎంతకాలం ఈ బాధ? కాంగ్రెస్ జమానాలో రెండు కథలు జరిగినయ్. ఒకటి.. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం. ఆనాడు పోరాడినం. జైలుకు బోయినం. లాఠీదెబ్బలు తిన్నం. ఇక్కడ ఉన్న కాంగ్రెస్‌నేతలు డ్రామాలుచేసింద్రు. తర్వాత రాజశేఖర్‌రెడ్డికి సహకరించి నోరుమూసుకోని కూసున్నరు. భూములు మునిగితే ఆనాడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పించిన నష్టపరిహారం ఎంత? ఈరోజు మేం ప్రాజెక్టులు కడితే పరిహారం గురించి మాట్లాడుతున్నడు. ఏ నోరు, ఏ మొఖం పెట్టుకొని మాట్లాడుతున్నడు? సమాధానం చెప్పాలె! ఖమ్మం జిల్లాలో 9వేల ఎకరాలు, నల్లగొండలో వేల ఎకరాలు ముంచేసి నోరుగొట్టి సాగర్ నీళ్లు రాకుంట చేసి.. శ్రీశైలం దగ్గర రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు పొక్క పొడిసి 65వేల క్యూసెక్కుల కాల్వ తవ్వితే రెండు జిల్లాల దక్షిణ తెలంగాణ నాయకులు నోరు తెర్వలె. మేమే పోరాటం చేసినం. వాళ్లెవ్వరూ రైతుల క్షేమాన్ని కోరి పని జెయ్యలె. చేస్తే ఇట్ల ఉండేది కాదు. మన హక్కులు మనకు ఉండేవి. ఆరునూరైనా సరే.. లక్ష ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు అడ్డుకున్నా సరే.. కచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి తీరుతం. యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా ప్రజలకు శాశ్వతంగా కరువు దూరం కాబోతున్నది. తెలంగాణలో ఉన్న ప్రతి ఇంచు గురించీ నా హృదయం అంతే కొట్టుకుంటది. అంతే తన్లాడ్తది. నేను ఉద్యమం చేసిన్నాడు కోటి ఆశలతోని నా నాయకత్వాన్ని బలపర్చిన్రు. నన్ను నడిపించింది మీరే. అవసరమైతే నా రక్తపు బొట్టు రంగరించైనా సరే, న్యాయం జేయడానికి ప్రయత్నం జేస్త.

సాగర్ ఆయకట్టుకు నీళ్లిస్తాం..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 20టీఎంసీల ప్రాజెక్టులు రెండు.. గంధమల్ల, బస్వాపూర్ నిర్మాణం జరుగుతున్నయ్. పేరుకు ప్రాజెక్టులు అక్కడ ఉన్నయ్. లాభపడేది మొత్తం జగదీశ్‌రెడ్డి సూర్యాపేట, నకిరేకల్లే. మూసీ ప్రాజెక్టు 365రోజులు నిండే ఉంటది. ఎండేది లేదు. కొంచెం కాల్వ పెంచితే.. మిడ్‌మానేరు నుంచి వచ్చే ఎస్సారెస్పీ కాల్వ.. కాళేశ్వరం అయిపోతే సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ చరిత్రలో ఊహించని నీళ్లొస్తయి. సాగర్ ఎడమకాల్వ ఉన్నది.. సాగర్‌ల గోదావరిని పడేయండి అని చాలామంది అడుగుతున్నరు. దానికంటే ఉత్తమ ఆలోచన చేసినం. సాగర్ ఎడమకాల్వ 42వ కిలోమీటర్ దగ్గర పెద్దదేవులపల్లి రిజర్వాయర్ 0.85టీఎంసీలతో ఉన్నది. ఆ రిజర్వాయర్ పైన పారకం ఉన్నది కేవలం 77వేల ఎకరాలే. మిగతా 3.2లక్షల ఎకరాలు పెద్దదేవులపల్లి కిందనే ఉన్నది. బస్వాపూర్, గంధమల్లకు నీళ్లు తెచ్చే కాల్వ సైజు కొంచెం పెంచి కేతేపల్లి, నకిరేకల్ మండలాల ద్వారా 30కి.మీ. మేర తవ్వితే ఉదయ సముద్రం ప్రాజెక్ట్ కింద పానగల్లు వాగులో పడ్తది. డైరెక్టుగ పెద్దదేవులపల్లికి వస్తది. కింద ఉన్న 3.2లక్షల ఎకరాలు రెండు పంటలు నల్లగొండ రైతులు మీసంమెలేసి పండించుకునే పరిస్థితి త్వరలోనే వస్తది.

మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ ఎన్‌ఎస్పీ ఆయకట్టు సంపూర్ణంగా పండించుకోవడమే కాదు.. ఆ నీళ్లు మళ్లీ పాలేరుకు కూడా వెళ్లిపోయే పరిస్థితి వస్తది.

# సామాజిక న్యాయం ఐకాస కన్వీనర్‌గా రవికుమార్

ఖానాపురం : విశాంత్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఛైర్మన్‌గా ఉన్న సామాజిక న్యాయం (సోషల్ జస్టిస్) జేఏసీకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా లింగాల రవికుమార్‌ను నియమించారు. ఇటీవల ఖమ్మం వచ్చిన చంద్రకుమార్ ఇక్కడ పలు ప్రజాసంఘాలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన సంస్థ అయిన సోషల్ జస్టిస్ జేఏసీగా కొంత మందిని నియమించేందుకు చర్చలు జరిపారు. జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ నియామక పత్రం విడుదల చేశారు. సంఘ గౌరవ సలహాదారులుగా కూరపాటి వెంకటేశ్వర్లు, మేకల సుగుణారావు, డా.కె.వి.కృష్ణరావు, కాకి భాస్కర్, డా.బి.బాబు రత్నాకర్, సుంకుర శ్రీనివాసరావు, లీగల్ సలహాదారుగా వంజకు సతీష్‌కుమార్, మహిళా ప్రతినిధి కామ విజయలక్ష్మి తదితరులను నియమించి నట్లు జిల్లా కన్వీనర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాధితులకు సామాజిక న్యాయం కల్పించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## జ్వరాలు, తరుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### వైద్యాధికారుల సమావేశంలో కలెక్టర్ లోకేశ్‌కుమార్



ఖమ్మం : జిల్లాలో డెంగీ, మలేరియా, స్వైన్‌ఫ్లూ జ్వరాలతోపాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లోకేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్, నవంబర్ నెలల్లోనూ తరుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు అనుగుణంగా డీ వాటరింగ్, ఫ్రైడే డ్రైడే, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యాధులు ప్రబలిన ప్రాంతాల్లో వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందితో కలసి గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఈడీడీ, బర్త్‌ప్లాన్ జాబితాలు ప్రతి వైద్యాధికారి వద్ద ఉండాలని, దీంతోపాటు ప్రతి గర్భిణీతో వైద్యాధికారులు మాట్లాడాలని చెప్పారు. ఆసుపత్రి కాన్పులు గురించి వారికి వివరించాలని, కనీసం పది ప్రసవాలు చేయాలని సూచించారు. డేటా ఎంట్రీ పై ఎప్పటికప్పుడు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాన్పు అయిన, అర్హత కలిగిన గర్భిణీకి తప్పనిసరిగా కేసీఆర్ కిట్‌తోపాటు ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సిజేరియన్ శస్త్ర చికిత్సలు తగ్గించి సాధారణ కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కొండలరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మదన్‌సింగ్, డీపీఓ శ్రీనివాసరెడ్డి, డీఐఓ అలివేలు, డీపీఎంఓ కళావతిబాయి, ఉప డీఎంహెచ్ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.70 కోట్లు

రాయికోడ్: స్వచ్ఛభారత్ కింద మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 3900 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.70కోట్లు మంజూరయ్యాయని డీఆర్‌డీఓ పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. మిషన్ అంత్యోదయ గ్రామ సమృద్ధి స్వచ్ఛత పక్షోత్సవాల సందర్భంగా రాయికోడ్ ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. డిసెంబరు 31 నుంచి బహిరంగ మలవిసర్జన గ్రామాలు మారేలా సర్పంచులు, అధికారులు సమన్వయంగా పనిచేసి గ్రామాల్లో శతశాతం శౌచాలయాల నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 295 మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని చెప్పారు. ఉపాధిహామీ పథకంలో భాగంగాగ శ్మశాన వాటికలు, వంటగదుల నిర్మాణం చేపట్టి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఐకేపీ ద్వారా నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని.. ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎల్‌బీఎం సమన్వయకర్త స్వామి, నారాయణఖేడ్ ఏపీడీ రాకేష్, ఎంపీపీ వెంకట్‌రావు, ఎంపీడీఓ స్టీవెన్ నీల్, ఏపీవో షాహెద్, ఈసీ విష్ణువర్ధన్, ఏపీయం నర్సిములు, సర్పంచులు, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

## జీవితాంతం జిల్లా అభివృద్ధికే పాటుపడతా

సత్తుపల్లి: జీవితాంతం ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి అవిరామ కృషి చేస్తానని రోడ్లు, భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో రూ.3.5కోట్ల నిధులతో చేపట్టిన సిమ్మెంటు రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి సత్తుపల్లికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందజేసేందుకు కృషి జరుగుతుందన్నారు. శ్రీరాంసాగర్ ద్వారా ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాలకు తాగునీరు అంద జేస్తామన్నారు. జిల్లాలో 24గంటల విద్యుత్తు సరఫరాకు అవసరమైన విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సత్తుపల్లి పట్టణంలో రహదారుల నిర్మాణానికి మరో రూ.5కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వాతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిరంకుశ ధోరణి వీడాలి

మెదక్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు బ్లాక్ డే పాటించారు. నల్లబ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలు పట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌చౌదరి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి విడనాడాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబరులో దేశ రాజధాని దిల్లీలో ప్రభుత్వ తీరుకు నిరసనగా భారీ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని, ప్రైవేటు బోధన, బోధనేతర సిబ్బందికి ఆరోగ్యకార్డులు, ఇళ్లు లేనివారికి రెండు పడకగదుల ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ఇబ్రహీంపూర్‌నకు ప్రధాని ప్రశంస

### ఇంకుడుగుంతల నమూనా పరిశీలన



సిద్దిపేట : ఇబ్రహీంపూర్ ఇంకుడుగుంతల నమూనాను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నానాజీ దేశ్‌ముఖ్ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యశాల, ప్రదర్శనలో రాష్ట్రం నుంచి వివిధ అంశాలను ప్రదర్శించారు.

ఇందులో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారి శతశాతం ఇంకుడుగుంతలు నిర్మించి స్ఫూర్తిగా నిలిచిన గుంతల నమూనాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టాల్ వద్దకు ప్రధాని రాగానే ఇబ్రహీంపూర్ సర్పంచి కుమారుడు ఎల్లారెడ్డి ఇంకుడుగుంతల తీరుతెన్నులపై వివరించారు. దీంతో ఇంకుడుగుంతల విధానం బాగుందని కితాబిచ్చినట్లు ఉత్సవాలకు వెళ్లిన అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలి

దౌల్తాబాద్, హత్నూర: ఎన్నికల సమయంలో తెరాస ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని భాజపా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కాసాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్లిబొల్లి మాటలతో గద్దెనెక్కిన తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజలను నిలువునా మోసం చేస్తోందని దుయ్యబట్టారు. నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానన్న మాటను పూర్తిగా మరిచిపోయి తుంగలో తొక్కిందని విమర్శించారు.

తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. మిషన్ భగీరథ, కాకతీయ పథకాలకు రంగులు రుద్ది గొప్ప పేరు సంపాదించుకునేందుకు తహతహలాడుతోందని ఆరోపించారు.

భవిష్యత్తులో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బిట్ల మహేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి అబ్దుల్‌వహీద్, నాయకులు రాజు, నిఖిల్‌గౌడ్, నాగప్రభుగౌడ్, కృష్ణ, ప్రవీణ్, బ్రహ్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎం కార్యాలయం ఎదుట..

## ప్రైవేటు బస్సుల డ్రైవర్ల ఆందోళన



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ప్రైవేటు బస్సుల డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో జిల్లాలోని వివిధ డిపోల్లో నడిపిస్తున్న ప్రైవేటు బస్సుల డ్రైవర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. బస్సుల యజమానులు డ్రైవర్లకు, హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వడం లేదని, ఎనిమిది గంటలు పని చేయాల్సిన డ్రైవర్లను ఇష్టానుసారం పని చేయించు కుంటున్నారని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని, ఎక్కువ పని గంటలకు ఓవర్‌టైమ్ నమోదు చేయడం లేదని, దుస్తులు సైతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల యజమానులు ఇకనుంచి డ్రైవర్లకు రూ.18 వేలు, హెల్పర్లకు రూ.15 వేలు కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, డ్రైవర్లు, హెల్పర్లకు ఏటా రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎం వినోద్‌కుమార్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కార్మికశాఖ కార్యాలయం ముందు సైతం ఆందోళన చేపట్టి తమ సమస్యలు కార్మికశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, సభ్యులు తిరుమలయ్య, డ్రైవర్లు శ్రీనివాసులు, నిరంజన్, వెంకటయ్య, భీమయ్య, శివకుమార్, ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నెస్పీ స్థలంలోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం

### ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం: నగరంలోని ఎన్నెస్పీ స్థలంలో ఖమ్మం సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయని, ఈ విషయాన్ని రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వం రావు సమ్మతి మేరకు ప్రకటిస్తున్నానని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. గతంలో కలెక్టరేట్ నమూనాకు సేకరించిన ఎన్నెస్పీ స్థలం అనువుగా ఉండదని అధికారులు భావించి రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెం తదితర ప్రాంతాల్లో సర్వే చేశారన్నారు. ఈ క్రమంలో కొందరు నాయకులు ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై బురదజల్లే ప్రయత్నాలు చేసిందన్నారు. కలెక్టరేట్ తరలింపు వెనుక స్థిరాస్తి వ్యాపారం ఉందని, కొందరు తెరాస నేతలు వెంకటాయపాలెం సమీప ప్రాంతాల్లో భూములు కొన్నారని అసత్య ఆరోపణలు చేశారని ఆరోపించారు. ప్రతిపక్షాలకు ఏ సమస్య దొరక్కపోయే సరికి ప్రతి విషయాన్ని రంధ్రాన్వేషణ చేస్తోందన్నారు. వెంకటాయపాలెం సమీప రైతులు కూడా భూములు ఇచ్చేందుకు సిద్ధంగాలేని విషయం మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. ఎన్నెస్పీ స్థలంలోనే కాస్తంత నమూనా(డిజైన్) మార్చి కలెక్టరేట్ భవన నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో మేయర్ పాపాలాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కమర్తపు మురళి, కార్పొరేటర్లు వలరాజు, నాగరాజు, ఎం.నాగేశ్వర రావు, నేతలు వీరభద్రం, జశ్వంత్, వెంకట రమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో మంచి ఆలోచనలు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంకటకృష్ణయ్య



వీరన్నపేట : మేము చదువుకునే రోజుల్లో అసలు ర్యాగింగ్ అనే మాట లేదు.. అందరు కలిసి మెలిసి ఉండి చదువుకున్నాం.. నేడు ర్యాగింగ్ నిషేధ చట్టాలు తీసుకువచ్చి.. వాటి గురించి చర్చించేందుకు సదస్సులు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంకటకృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాలు, అంతర్జాలాన్ని విజ్ఞానం పెంచుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. తల్లి దండ్రులు పిల్లలపై ఎంతో ఉన్నత ఆలోచనలతో కళాశాలకు పంపిస్తారని వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా విద్యార్థులు చదువు సాగించాలని అన్నారు. అసలు చెడు ఆలోచనలను మనసులో రాకుండా చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీనియర్లు.. జూనియర్లు అనే మాటలు మనసులోకి రాకుండా అందరు కలిసి మెలిసి చదువు సాగించాలని కోరారు. ర్యాగింగ్ చేయడం చట్ట ప్రకారం నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని సూచించారు. విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. చదువు పూర్తి చేసుకున్న తర్వాత పేదలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉండాలని, డబ్బు సంపాదన వంటి విషయాలపై దృష్టి పెట్టవద్దని కోరారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల ఆలోచనలు మంచి మార్గంలోకి వెళ్లే అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఎంతమంది గాంధీ జీవిత చరిత్ర, స్వామి వివేకానంద పుస్తకాలు, అబ్దుల్ కలాం చరిత్ర చదివారని అడిగితే విద్యార్థులు ఎవరూ స్పందించకపోవడంతో ఆయన ఆశ్చర్యపోయారు. కళాశాలలో నెల రోజుల్లో గ్రంథాలయం ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. వెయ్యి పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరగడంతోపాటు మనిషిలో మార్పు వచ్చేందుకు అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు డా.రాంకిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు లేకపోవడం బాధాకరమని అన్నారు. అందరు అలవాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.సునందిని, సామాజిక కార్యకర్త రాజమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలంతా విద్యావంతులైతేనే అభివృద్ధి సాధ్యం

### గద్వాలలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆచార్యులు




గద్వాల : మహిళ విద్యావంతురాలైతే ఆమె కుటుంబంలోని వాళ్లంతా ఉన్నత చదువులు చదివేందుకు అవకాశముంటుందని, మహిళలంతా విద్యావంతులైనప్పుడే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు అన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌజన్యంతో గద్వాల ప్రభుత్వ ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో పేదరిక నిర్మూలనలో మహిళా స్వయం సహాయక సంఘాల పాత్ర అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సును ఏర్పాటు చేశారు. కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ, ఎమ్మెల్యే డీకే అరుణ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాపరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందని, మహిళలు చైతన్యవంతమై సెర్ప్ అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయని, పేద కుటుంబాల్లో మార్పు కనిపిస్తోందని అన్నారు. విజయనగరం జిల్లా పార్వతీపురం మండలంలో మొత్తం లక్ష కుటుంబాలు ఉండగా అందులో 60వేలు గిరిజనులవేనని తెలిపారు. వారంతా 75వేల బ్యాంక్ ఖాతాలు పొంది రూ. 72 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తుండటం మహిళా సంఘాల చలవేనని పేర్కొన్నారు. ఇలాంటి చైతన్యం ప్రతీ సంఘం పుణికిపుచ్చుకుంటే దేశంలో పేదరికాన్ని పూర్తిగా రూపుమాపవచ్చని తెలిపారు. గూర్ఖాలాండ్, కేరళలోని వైనాడు ప్రాంతాల్లోని తేయాకు తోటల్లో పనిచేసే మహిళలు కూడా సంఘాల ద్వారా రుణాలు పొంది ప్రగతి సాధించారన్నారు. ఎమ్మెల్యే డీకే అరుణ మాట్లాడుతూ మహిళా సంఘాలు, వడ్డీ లేని రుణాల వల్లే రాష్ట్రంలో మహిళల పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. 1989లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో రాజకీయంగానూ రాణిచేందుకు అవకాశం దక్కిందన్నారు. ఇంకా ఆడపిల్లలపై వివక్ష, దాడులు కొనసాగటం శోచనీయమన్నారు. వీటిని రూపుమాపితేనే సమాజం పురోగమిస్తుందని అభిప్రాయపడ్డారు. మహిళలు, బాలికలు ఆత్మవిశ్వాసంతో అవాంతరాలను ఎదుర్కోవాలని సూచించారు. రెండు రోజులపాటు ఆచార్యులు చెప్పే అంశాలపై విద్యార్థులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని కోరారు. అనంతరం సావనీర్‌ను, పరిశోధనా పత్రాలను అతిథులు ఆవిష్కరించారు. పీయూ రిజిస్ట్రార్ పాండురంగారెడ్డి, పంజాబ్ రాష్ట్ర ప్రణాళిక సభ్యుడు ప్రొ.శంకర్ ఛటర్జీ, రాష్ట్ర ఐబీ ఇన్‌స్టిట్యూట్స్ సలహాదారు విజయభారతి, ఎస్వీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉషారాణి, మలబార్ విశ్వవిద్యాలయం ప్రొ. చంద్రకాంత్ భాంగే, దిల్లీ విశ్వవిద్యాలయం ప్రొ.శ్రీనివాస్, పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మధుసూదన్‌రెడ్డి, పురపాలిక ఛైర్‌పర్సన్ కృష్ణవేణి, వైస్ ఛైర్మన్ శంకర్, మార్కెట్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, పీసీసీ కార్యదర్శి కృష్ణారెడ్డి, కళాశాల ఉపప్రధానాచార్యులు గంగాధర్, ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.జాఫరున్నీసా, కౌన్సిలర్ అనిత, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి డా.రుక్మిణి, కాంగ్రెస్ జిల్లా నేతలు పద్మావతి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పకడ్బందీగా దోష నిరూపణ

సంచలనాత్మకమైన ఆరుషి హత్య కేసులో ఆమె తల్లిదండ్రులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఆరుషి, నౌకరు హేమ్‌రాజ్ హత్య కేసులో ఆమె తల్లిదండ్రులు రాజేశ్ తల్వార్, నూపుర్‌లను దోషులుగా నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. 2013 నవంబర్ 25న సీబీఐ ప్రత్యేక కోర్టు తల్వార్ దంపతులు దోషులని తీర్పు ఇచ్చి జీవిత ఖైదు విధించింది. దీంతో తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ ఈ కేసులో సుప్రీంకోర్టుకు అపీలు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే తమ దగ్గర ఉన్న ఆధారాలు, ప్రజాభిప్రాయం వంటి అనేక విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించుకోవలసి ఉంటుంది. 2008 జనవరిలో ఢిల్లీ శివారులోని నోయిడాలోని సొంత ఇంటిలో ఆరుషి అనే పధ్నాలుగు ఏండ్ల బాలిక హత్యకు గురైంది. అదే రోజు హేమ్‌రాజ్ అనే నౌకరు హత్య కూడా జరిగింది. కానీ ఆయన మృతదేహం ఇంటి మిద్దెపై ఉన్నట్టు మరుసటి రోజు గానీ గుర్తించలేకపోయారు. ఈ కేసులో పోలీసులు, ఆ తరువాత సీబీఐ బృందం తల్లిదండ్రులపై, ముగ్గురు నేపాలీ పనివారిపై దర్యాప్తు జరిపిన తీరు తీవ్ర ఆక్షేపణకు గురైంది. బాలిక వ్యక్తిత్వంపై, తల్లిదండ్రుల జీవన విధానంపై పోలీసులు వెల్లడించిన అభిప్రాయాలు కూడా తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. ఈ కేసులో దర్యాప్తు యంత్రాంగ వైఫల్యం అనేక సందర్భాలలో వెల్లడైంది. దర్యాప్తు సంస్థ అనుమానం ఆరుషి తల్లిదండ్రుల మీదే ఉన్నది కానీ, వారే దోషులని తగిన ఆధారాలు చూపలేకపోయింది. దీంతో వారే దోషులని చెప్పలేని పరిస్థితి. అయితే తల్లిదండ్రులు నిర్దోషులనే వాదన కూడా బలంగానే ఉన్నది. తల్లిదండ్రులను దోషులుగా చూపించడం కోసం సాగిన దర్యాప్తు తీరు తెన్నులను తప్పు పట్టిన వారూ ఉన్నారు. దర్యాప్తు అధికారులు తల్లిదండ్రులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం కూడగట్టడానికి అనుసరించిన విధానమైతే తీవ్ర విమర్శలకు గురైంది. ఆరుషి తల్లిదండ్రులే హంతకులంటూ నిరంతరం వెంటాడుతుంటే, వారు తమ బిడ్డ మరణం పట్ల ఈ తొమ్మిదేండ్లలో కనీసం తృప్తిగా ఏడువలేక పోయారని, హంతకులు స్వేచ్ఛగా తిరుగుతుంటే, ఈ బాధితులు తమకు బిగిసిన ఉచ్చు నుంచి బయట పడటానికి ఎంతో క్షోభ అనుభవించారని వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు అధికారులు చేసిన ఆరోపణల వల్ల సామాజికంగా తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడ్డది. వీరు హంతకులని నిస్సందేహంగా నిరూపించలేని నేపథ్యంలో- ఏ నేరానికి వీరు ఈ శిక్ష అనుభవించవలసి వచ్చిందనే ప్రశ్న తలెత్తుతున్నది. అనేక మలుపులు తిరిగిన ఈ రెండు హత్యల కేసులో ఇంతకూ హంతకుడు లేదా హంతకులు ఎవరు? దోషులు ఎవరో నిరూపణ కాకుండానే కేసు ముగింపునకు రావడమేమిటి? ఈ ప్రశ్నలు ఎవరికైనా కలుగడంలో ఆశ్చర్యం లేదు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనైనా, దోషులెవరో తేల్చవలసిందేనని భావించి, ఆధారాలు తగిన మేర లేకున్నా సరే, అనుమానం ఉన్న వారిపై నేరాన్ని మోపి చేతులు దులుపుకోవాలని అనుకోవడం సమర్థనీయం కాదు. పొట్టివాడు ఉరికంబానికి అందడం లేదు ప్రభూ అంటే, అయితే పొడుగు వాడిని పట్టుకొచ్చి ఉరితీయండి అనే విధంగా వ్యవస్థ ఉండకూడదు. ఈ కేసులో దోషులెవరో సందేహాతీతంగా రుజువు కాలేదు. కానీ ఈ కేసులో సందేహాతీతంగా స్పష్టమైనది మాత్రం- అక్కడి పోలీసుల అసమర్థత. నేరం జరిగిన చోట ఆధారాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకొని, వాటిని సేకరించాలనే కనీస అవగాహన వారికి లోపించింది. అపోహలు, వ్యక్తిగత దురభిప్రాయాలు దర్యాప్తులో కేసును నడిపించడంలో ప్రధాన పాత్ర వహించాయి. ఆరుషి హత్య విషయం తెలిసిన తరువాత, ఆ నివాసాన్ని మొత్తం గాలిస్తే, మిద్దెపై పడి ఉన్న నౌకరు హేమ్‌రాజ్ మృతదేహం అదే రోజు కనిపించేది. కానీ మొదటి రోజు హతుడే హంతకుడనే నిర్ధారణకు వచ్చారు. అక్రమ సంబంధం, వివాహేతర బంధాలు అంటూ రంజైన కథనాలను మీడియా ద్వారా వినిపించారు. సీబీఐ న్యాయస్థానం కూడా దోషులెవరో తేల్చకుండా కేసుకు ముగింపు పలుకడాన్ని జీర్ణించుకోలేక పోయింది. దీంతో కేసు మళ్ళా దర్యాప్తు చేపట్టే దశలో, తల్లిదండ్రులే దోషులనే భావన చుట్టూ దర్యాప్తు తిరిగింది. మొదటగా- ఈ కేసులో నేరస్థులను నిర్ధారించలేక పోయామనే విషయాన్ని ఆత్మవంచనకు పాల్పడకుండా అంగీకరించాలె. దీంతో ఈ పరిస్థితికి కారణమేమిటనే ప్రశ్న ముందుకు వస్తుంది. దర్యాప్తు యంత్రాంగంలోని లోపం బయట పడుతుంది. దర్యాప్తు తీరుతెన్నులు మారిపోతే, ఒక్క ఆరుషి కేసే కాదు, దేశంలోని అన్ని కేసుల పరిష్కారం సులభమవుతుంది. బాధితులకు న్యాయం జరుగుతుంది. దోష నిరూపణ పకడ్బందీగా జరుగుతుంది, నిర్దోషులపై నింద పడదు. దోషుల నిర్ధారణ జరుగాలని మళ్ళా దర్యాప్తుకు ఆదేశించిన సీబీఐ కోర్టు, ఆ

# ఈసారి ఆనంద దీపావళి జరుపుకొంటాం!

## ఆరుషి తల్వార్ కుటుంబీకులు



అలహాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరుషి తల్వార్ హత్యకేసులో నిందితులుగా ఉన్న ఆమె తల్లిదండ్రులు నుపూర్, రాజేశ్‌లకు వూరట లభించింది. ఈ కేసులో అలహాబాద్ హైకోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది.

కోర్టు నిబంధనల ప్రకారం శుక్రవారం ఆరుషి తల్లిదండ్రులు ఇంటికి చేరుకోనున్నారు. దాంతో వారి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నుపూర్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ మనవరాలి హత్య కేసులో నుపూర్, రాజేశ్‌లు జైలుకి వెళ్లినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి పండుగలు జరుపుకోలేదని ఈసారి మాత్రం దీపావళి కలిసే జరుపుకొంటామని నుపూర్ తండ్రి చిట్నీస్ తెలిపారు.

నా కూతురు, అల్లుడు విడుదలైన సందర్భంగా మా కుటుంబం మొత్తాన్ని ఆహ్వానించాం. కానీ ఆరుషిని మాత్రం మిస్సవుతున్నాం. ఈ పదేళ్లు ఎంతో బాధాకరంగా గడిచిపోయాయి. ఆరుషి చనిపోవడంతో చాలా కోల్పోయాం. ఆమె ఎక్కడున్నా తన తల్లిదండ్రులకు న్యాయం జరిగినందుకు సంతోషిస్తుంది అని పేర్కొన్నారు.

అయితే ఇక ఆరుషి హత్య కేసు విషయంలో ఏమీ చేయలేమని మున్ముందు ఎలాంటి న్యాయస్థానాలకు వెళ్లబోమని చెప్పారు.

# ఈ గుండె 1300 కిలోమీటర్లు పయనించింది!




ముంబయి: అయవదానంపై పలు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన పెంచుతుండడంతో దాని ఆవశ్యకతను ఇప్పుడిప్పుడే అందరూ తెలుసుకుంటున్నారు. తాజాగా ముంబయిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి గుండెను ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 1300 కిలోమీటర్ల దూరంలోని ఓ వ్యక్తికి అమర్చి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ఇందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, వైద్యులు ఎంతో సహకారం అందించారు.

నవీ ముంబయి చెందిన చేతన్ టేలర్ ఓ చిరు వ్యాపారి. తీవ్ర అస్వస్థతతో 20 రోజుల కిందట అపోలో ఆస్పత్రిలో చేరాడు. ఆయన మెదడులో రక్తస్రావం అవుతున్నట్లు వైద్యులు గుర్తించారు. దాన్ని ఆపేందుకు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆస్పత్రికి చెందిన వైద్యుడు అవయవదానం గురించి చేతన్ భార్య, కుమారుడికి అవగాహన కల్పించడంతో వారు చేతన్ గుండెను దానం చేసేందుకు ముందుకొచ్చారు. కేవలం చేతన్ గుండె మాత్రమే వేరొకరికి అమర్చేందుకు వీలుంది. మిగిలిన అవయవాలు ఎవరికీ సరిపోలేదు అని అపోలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ ముగలికర్ తెలిపారు.

అయితే, ఆస్పత్రిలో 26మంది గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగులు ఉన్నా, వారెవరికీ చేతన్ గుండె సరిపోలేదు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌వోటీటీవో) వేరెవరికైనా ఈ గుండె సరిపోతుందేమోనని ఆరా తీసింది. చెన్నైలోని నివసిస్తున్న లెబనాన్‌కు చెందిన 61 ఏళ్ల వ్యాపారవేత్తకు అది సరిపోతుందని తెలీడంతో నవీ ముంబయి నుంచి గుండెను చెన్నైకు తరలించారు.

గుండెను తరలించే క్రమంలో అధికారులు ఎక్కడిక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ఆస్పత్రి నుంచి కేవలం 40 నిమిషాల్లో గుండెను ముంబయి ఎయిర్‌పోర్ట్‌కు చేర్చారు. చార్టెడ్ విమానంలో అక్కడి నుంచి కేవలం నాలుగు గంటల్లో చెన్నైలోని ఫోర్టిస్ ఆస్పత్రికి తీసుకొచ్చి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశారు.

# బెంగళూరులో రహదారిపై జలకన్య..



బెంగళూరు: అది బెంగళూరు మహానగరం. దేశ ఐటీ హబ్ కూడా. ఎప్పుడూ రద్దీగా ఉండే ఓ రహదారిపై నీటి గుంతలో ఓ జలకన్య కనిపించింది. జలకాలాడుతూ ఆ మార్గంలో వెళ్లేవారిని ఆకట్టుకుంది. ఇంతకీ ఇదంతా ఏంటంటారా? అయితే చదవండి..

బెంగళూరు నగరంలో చాలా రహదారులు అధ్వానంగా మారాయి. ప్రజల ప్రాణాలు బలిగొనేస్థాయికి దిగజారిన రహదారుల దుస్థితిని వివరిస్తూ కొందరు వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఓ యువతి జలకన్య వేషధారణలో గబ్బన్ పార్కు జంక్షన్ ప్రాంతంలో రహదారిపై నీరు నిలిచిన చోట ఇలా నిరసన తెలిపింది. నగరంలో నెలకొన్న రోడ్ల దుస్థితిని తెలియజేసే ప్రయత్నం చేసింది.

వర్షాకాలం బెంగళూరు రహదారులు గుంతలమయం కాగా.. వాటి కారణంగా ఈ నెలలో జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ వ్యవహారంపై స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బెంగళూరు మహానగర పాలక సంస్థ అధికారులను గురువారం ఆదేశించారు.

## కవి సమయం

### 'ఊహా జనికములు'

సిరి సంపదలెల్లను ఒకరీతిన సాగిపోవు
లక్ష్మిదేవి ఎలా వస్తుందో! ఎలా పోతుందో!
తెలియకాయె
కూర్చుంటే డబ్బు!... నిలబడితే డబ్బు అన్నోళ్లు
నిలువ నీడ లేకపోయె
కూటికి కక్కుర్తియైన రోజుల్లో తండ్రి
డస్కులో దాచే పనికి రావన్న రాజుల పోడులు
వజ్రాలని పోల్చి - సినీ నిర్మాతలాయె... ॥సిరి॥
ఆకులు - అలములు తింటూ;
బ్రతుకు తెరువుకై పై గ్రామము వెడలె
పోలీసుల వెంటాడే భయంతో దొంగలు
విసిరిన బంగారు బిస్కెట్‌ల సూట్‌కేస్
దెబ్బతో జ్యూయలరీ షాపు ఓనర్లాయె
ఇరుగిల్లు - పొరిగిల్లు పప్పు రుబ్బి- అంట్లుతోమె
ఆడపడ్డు కొడుకులు, ఇంటి నిర్మాణ పనులలో
లంకెల బిందెలు కైవస్యమాయె
కారులో సికార్లు తిరిగెనాయె... ॥సిరి॥
గేదెల కాపరి - కాపరి పనికై;
పై దేశమేగి - నా దగ్గర వందలమంది
పనివాళ్లున్నారని - కాంట్రాక్ట్ కొరి
కోటీశ్వరుడై - ఎమ్.ఎల్.ఎ. ఆయె
అరటి గెలలు అమ్ముకొన్నాడు
షిర్డి బయలుదేరే, రైల్‌లో
లక్షల రూపాయల సూట్‌కేస్ చేతికందే
మధ్యదారి నుండే ఇంటికొచ్చె
ఎక్కడ చూసినా
రియల్ ఎస్టేట్ ఓనర్ ఆయె... ॥సిరి॥
కారు డ్రైవర్ కోట్ల రూపాయల సూట్‌కేస్
కొట్టుకుపోయె
ఎమిరా! ఇలాంటి పనిచేశావ్ అని ఓనర్
అడగగపోయె... అడిగితే తన గుట్టురట్టౌతుందని
నోరు మూసుకుపోయె
మిషనరీతో డబ్బు నోట్లు లెక్కించే
అంశముండే... అలాంటిది ఐ.పి.పెట్టుకొని
తిరగవల్సినాయె
రాజే కింకరుడాయె... ॥సిరి॥

...కవితా రచన
యల్.సిద్ధు
సెల్ నెం:7702977293

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : దశమి తె.3.45; పుష్యమి ఉ.9.57; రా.వ.10.01ల 11.32

శనివారం 14-10-2017

**మేషం** : వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. బంధువులను కలుసు కుంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. **మిథునం** : స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. **కర్కాటకం** : బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. **ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. **కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. **మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత

# హనుమంతుని వేదాంత కథ

## సంకీర్తన



ఒక రోజు శ్రీ రాముడు హనుమంతుని దగ్గరికి పిలిచి హనుమా !నేను చెప్పిన వేదాంత విషయాలన్నీ విన్నావు కదా. దేహ, జీవ, పరమాత్మలకు సమన్వయము చేస్తూ చెప్పు అని కోరాడు .అదే శిరోధార్యంగా భావించిన పరమ భక్త శిఖామణి మారుతి శ్రీ రామా ! వేదాంత రహస్యము తెలిసిన తరువాత కూడా ఈ దేహం ఉన్నంత వరకు దేహాన్ని, జీవుణ్ణి , పరమాత్మను వేరు వేరుగానే భావించాలి .దేహ దృష్టితో పరమేశ్వరుని ధ్యానిస్తూ ,సేవించాలి. అన్ని భావాలను త్యజించి, శరణాగతి పొందాలి. ఇతరు లకు ఉపకారం చేస్తూ, వారు కూడా భగవంతుని స్వరూపంగా భావించి, సేవించాలి. ఇలాంటి దానినే భక్తి లక్షణం అంటారు. ఇదే విశిష్టాద్వైత సిద్ధాంతం. జీవుడు వేరు, పరమాత్మ వేరు అని భావిస్తూ, భగవంతుని స్మరిస్తూ ...భగవంతుని పూజలు చేస్తూ ...భగవంతుని మూర్తులను చూసి ఆనందిస్తూ ఉండటాన్నే ద్వైతం అంటారు. జీవుడు, పరమాత్మ ఒక్కరే .ఎందులోను భేదం అనేది లేదు అని భావనలో, ఆచరణలో చూపించటం జ్ఞాన లేక, విజ్ఞాన లక్షణం అంటారు. ఇదే అద్వైత భావన. దేహ బుధ్యాతు దాసోహం, జీవ బుద్ధ్యాతు త్వదంశః ఆత్మా బుధ్యాతు త్వమేవాహం ఇతి మే నిశ్చితా మతిహ్ రామా ! దేహ దృష్టిలో నేను నీకు దాసుడిని .జీవ దృష్టిలో నీవు పరమాత్మవు. నీ అంశ చేత నేను జీవ స్వరూపుడను.పరమాత్మ దృష్టిలో నీవే నేను-నేనే నీవు. ఈ మూడు లక్షణాలు నాలోనూ, నీలోను ఉన్నాయి. ఇంక భేదానికి అవకాశమే లేదు. అని స్పష్ట పరచాడు హనుమంతుడు.. అంజనా నందనుడి సమాధానం విని పరమానంద భరితుడయ్యాడు దాశరధి. త్వమేవాహం, త్వమేవాహం అని చాలా సార్లు హనుమను అభినందించాడు. యత్రాస్తి భోగో నహి తత్ర మోక్షః యత్రాస్తి మోక్షో నహి తత్ర భోగః శ్రీ మారుతిత్సేవన తత్పరాణాం భోగశ్చ, మోక్షశ్చ, కరస్త యేవ అంటే ఎక్కడ భోగం ఉంటుందో అక్కడ మోక్షం ఉండదు. ఎక్కడ మోక్షం ఉంటుం దో అక్కడ భోగానికి అవకాశమే లేదు. కానీ శ్రీ హనుమ సేవా తత్పరులైన వారికి భోగమూ ,మోక్షమూ రెండు తప్పక లభి స్తాయి అని శ్రీ రాముడు వరం అను గ్రహించాడు. దానికి వెంటనే ఆంజనేయుడు నువ్వు శివుడవు. నేను భద్రుడను.నీకూ నాకు భేదమే లేదు అని చెప్పాడు.

### చిటికెల భాగవతం

అయోధ్యలో ఉన్నంత కాలం శ్రీ రామునికి సర్వ సేవలు హనుమంతుడే చేశాడు. ఇది చూసి సీత లక్ష్మణుడు, భరత శత్రుఘ్నులు చాలా బాధ పడుతున్నారు. వారికి రాముని సేవలు చేసే అవకాశమే రావటం లేదు. రాత్రి వేళల్లో సీతాదేవి చేయాల్సిన సేవలకు హనుమ అడ్డం వస్తున్నాడు. వీరంతా కలిసి ఆలోచించి,ఒక ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. అన్ని సపర్యలు తామే చేసేటట్లు హనుమకు మాత్రం అతి చిన్నది అయిన ఒక పని అప్పగించారు. అదే చిటికెల కార్యక్రమం .ఆ పనినైనా తనకు ఉంచినందుకు పరమానంద పడ్డాడు మారుతి. అందరికి అంగీకారమైన పరిష్కారం లభించింది. అయోధ్యలో ఉన్నంత కాలం

శ్రీ రామునికి సర్వ సేవలు హనుమంతుడే చేశాడు. ఇది చూసి సీత, లక్ష్మణుడు,భరత శత్రుఘ్నులు చాలా బాధ పడుతున్నారు . వారికి రాముని సేవలు చేసే అవకాశమే రావటం లేదు .రాత్రి వేళల్లో సీతాదేవి చేయాల్సిన సేవలకు హనుమ అడ్డం వస్తున్నాడు. వీరంతా కలిసి ఆలోచించి, ఒక ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. అన్ని సపర్యలు తామే చేసేటట్లు హనుమకు మాత్రం అతి చిన్నది అరున ఒక పని అప్పగించారు. అదే చిటికల కార్యక్రమం. పగలంతా గడిచి పోయింది. సీతాదేవి శ్రీ రాముని గదిలోకి ప్రవేశించింది. హనుమ బయటకు వచ్చేశాడు. తలుపులు మూసేశారు దంపతులు. రాముడు ఎప్పుడు ఆవలిస్తాడో తెలీదు అందుకని హనుమ విడువకుండా చిటికెలు వేస్తూనే ఉన్నాడు. రాముడికి ఆవులింతలు వచ్చి, ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. పథకం బెడిసికొట్టింది. మళ్ళీ అంతా సమావేశమై సేవలన్నీ ఆంజనేయుడే చేయాలి అని నిర్ణయించారు.

# ఈ-ఔషధిలో వివరాలు నమోదు చేయాల్సిందే



మహబూబ్‌నగర్ : జిల్లాలోని ఆస్పత్రుల్లో ఔషధాల వినియోగం వివరాలను ఫార్మసిస్టులు కచ్చితంగా ఈ-ఔషధిలో నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.రజిని ఆదేశించారు. ఫార్మసిస్టులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆరోగ్య మిత్రలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే ఆస్పత్రుల్లో ఈ విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికి చేయలేదని తెలిపారు. సోమవారం నుంచి కచ్చితంగా ప్రతి ఆస్పత్రిలో ఈ-ఔషధి ద్వారా వివరాలు నమోదు చేసిన తరవాతే ఔషధాలు బయటికి ఇవ్వాలని కోరారు. ఆస్పత్రికి అవసరమైన మందుల వివరాలను సైతం జిల్లా కేంద్రానికి ఆన్‌లైన్‌లోనే పంపించాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చిన మందుల లెక్క, రోగులకు ఇస్తున్న మందుల వివరాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో ఉంటాయని అన్నారు. ఫలితంగా ఔషధాల పంపిణీలో పారదర్శకత ఉంటుందని చెప్పారు. కొన్ని ఆస్పత్రుల్లో ఔషధాలను వృథాగా పాడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ విధానం ద్వారా అలాంటి వాటిని అరికట్టేందుకు అవకాశం ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న అధికారులకు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏ మందుల వినియోగం ఎక్కువగా ఉంది... ఏ మందులను తెప్పించాలనే విషయంపై స్పష్టత వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతో ప్రమాదాలు దూరం

## ఖమ్మంలో రహదారి భద్రత అవగాహన ప్రదర్శన

ఖమ్మం : నిర్లక్ష్యం, అతివేగం, నిబంధనల అతిక్రమణలతో నిత్యం రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. అవి బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. అవగాహనతోనే ప్రమాదాలు నివారణ సాధ్యమని నినదించారు. రహదారి ప్రమాదాలు, పర్యవసానాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఆర్టీఏ అధికారులు భారీ ఎత్తున అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేపట్టి నినాదాలు చేశారు. ప్రత్యేక అతిథిగగా పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. నగరంలోని ఆర్టీఏ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గట్టయ్యసెంటర్, ఇల్లెందు క్రాసురోడ్డు, జడ్పీసెంటర్, బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా సాగి పెవిలియన్ మైదానం వరకు సాగింది. ర్యాలీలో నగర పోలీస్ అధికారులు, సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీసీ యాజమాన్యం, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఏఐటీయూసీ ఆటోయూనియన్ సభ్యులు, ఇతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా రవాణాధికారి హన్మంతరెడ్డి మాట్లాడారు. దేశంలో ప్రతి 5 నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. వాటిలో ప్రతి 3 నిమిషాలకు ఒకరు మృతి చెందుతున్నారని తెలిపారు. ఈ విధంగా కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రమాదాల బారిన పడేవారి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముందన్నారు. వాటిని నివారించడానికి ప్రజలు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. అందరు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. రక్షణగా శిరస్త్రాణాలు, సీటు బెల్టులను ధరించాలని పేర్కొన్నారు.

# ఎస్సారెస్పీకి పెరిగిన వరద

జగిత్యాల : జిల్లా వరదాయినైన శ్రీరామ్‌సాగర్ జలాశయంలోకి ఆలస్యంగానైనా వరదనీరు వస్తుండటం జిల్లా ప్రజలకు ఆనందం కల్గిస్తోంది. ఉదయం 11 గంటల వరకు 45,800 క్యూసెక్కుల చొప్పున వరద రాగా మధ్యాహ్నం 3 గంటల వరకు 46,100 చొప్పున ఇన్‌ఫ్లో వచ్చింది. సాయంత్రం 6 గంటల వరకు కాస్త తగ్గి 34,200 క్యూసెక్కులకు చేరింది. ఎస్సారెస్పీ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు ఉండగా గురువారం సాయంత్రం వరకు 40.952 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు నుంచి 866 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం స్థానికంగా నిజామబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కురిసిన వర్షంతో పాటుగా మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్టు నుంచి వదిలిన వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతోంది. దీని నుంచి కాలువలు, ఎత్తిపోతలకు దాదాపుగా 17 టీఎంసీల నీటిని ఇప్పటికే విడుదల చేశారు. ప్రస్తుతం నీటినిల్వ 40 టీఎంసీలు దాటడం, ఇన్‌ఫ్లో ఉండటంతో మరికొన్ని టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గోదావరిపై మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఈ నెలాఖరునే మూసివేయనున్నందున ఈలోపు వచ్చిన వరద నీటిని ఎస్సారెస్పీలో నిల్వగా ఉంచినట్లయితే దీని పరిధి రైతులకు మేలు జరుగుతుంది. ఈ నెలనుంచి విత్తుకునే ఆరుతడి పంటలకు బావులు, బోర్లతో ముందుకు సాగినా మోటర్లతో రైతులు పోసుకునే రబీ వరినార్లకు డిసెంబరు నుంచి నీరు అవసరమవుతుంది.

జనవరి రెండవ పక్షం నుంచి ఏప్రిల్ వరకు పంటకు చివరి దశలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది కాబట్టి చివరివరకు వచ్చేలా నీటి ప్రణాళికను రూపొందించి, పక్కాగా అమలు చేస్తేనే అన్నదాతలకు ఫలితముంటుంది. ఇదివరకు పలుమార్లు సరైన ప్రణాళిక లేకుండా, కొందరి ఒత్తిడికి తలొగ్గి, ఇంజనీర్ల కమిటీ సమావేశ తీర్మానాలను అమలు చేయకుండానే ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో రైతులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

కనీసం ఇప్పటినుంచైనా సరైన ప్రణాళికతో రిజిష్టర్డ్ ఆయకట్టు, తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# భూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతం చేయాలి

**- సీఎస్ ఎస్పీ సింగ్**

జగిత్యాల : భూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డీఆర్ మీనాతో కలిసి జిల్లా కలెక్టర్‌తో దృశ్యమాద్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, అధికారులందరూ పూర్తి అవగాహనతో దస్త్రాల శుద్ధీకరణ చేయాలని సూచించారు. కార్యక్రమ అమలులో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉత్పన్నమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, భూసమస్యల పరిష్కారంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సవరించిన దస్త్రాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ... జిల్లాలో 72 గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామని ఇప్పటివరకు 32 గ్రామాలను భూ వివాద రహితంగా తీర్చిదిద్దామన్నారు. 96 శాతం వివాద రహిత జిల్లాగా ప్రగతి సాధించామని, సాదాబైనామా దరఖాస్తులను 73 శాతం పరిష్కరించినట్లు వివరించారు. జేసీ ముషారఫ్ ఫారుఖీ, ఆర్డీవో డాక్టర్ జి.నరెందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు డీఎఫ్ఆర్‌సీ వద్దు

కరీంనగర్ : ఉపాధి, సేవా భావంతో పనిచేస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో డిస్ట్రిక్ట్ ఫీజు రెగ్యులేటరీ కమిటీలు వద్దని, లాభాపేక్షతో పనిచేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో వాటిని అమలు చేయాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని తెలంగాణ ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. కోతిరాంపూర్‌లోని హిరణ్మయి కృష్ణవేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవా భావంతో పనిచేస్తున్న ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కార్మికులకు కల్పిస్తున్న ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించడంతో పాటు ఆరోగ్య కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం ఆంక్షలను పెడుతూ నిర్వీర్యం చేసే ప్రయత్నాలను చేస్తోందని.. దీన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా, జిల్లాలోనూ ప్రైవేటు పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది గురువారం నిరసన దినంగా పాటించినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలన్ని ప్రభుత్వం అడిగినట్లుగా ఆడిట్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందచేస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలలపై యాజమాన్యాలు, డీఈవోలకు పెత్తనం ఇవ్వాలని, డీఎఫ్ఆర్సీలకు అప్పగిస్తే వ్యవహారం మరో రకంగా మారి యాజమాన్యాలు ఇక్కట్లు పడుతారని తెలిపారు.

# మూసీ నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల



కేతేపల్లి : మూసీ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయానికి వరదనీటి రాక కొనసాగుతుంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 645 అడుగుల స్థాయికి మించకుండా ఉండేందుకు అధికారులు నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖాధికారులు డ్యామ్ వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఒక్కో క్రస్టు గేటును అడుగున్నర ఎత్తుమేర లేపి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ఎగువ ప్రాంతాల నుంచి 3,600 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు నీటిమట్టం 644.5 అడుగుల వద్ద నిలకడగా ఉండే విధంగా అధికారులు నీటి చేరిక, విడుదలను గమనిస్తున్నారు. ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువకు 50 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున మొత్తం 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సూర్యాపేట పట్టణానికి తాగునీటి అవసరాల కోసం రెండు లక్షల గ్యాలన్ల నీటిని వదులుతున్నారు.

# జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి



మహబూబ్‌నగర్ : నేరుగా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది.. దీనిని తేలికగా తీసుకోవద్దు.. పట్టుదలతో రాణించి జిల్లాకు పెద్దమొత్తంలో పతకాలు సాధించి పెట్టాలని డీవైఎస్‌వో టీవీఎల్ సత్యవాణి అన్నారు. మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో 15వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే కొత్త మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14, 16 బాల,బాలికల జట్ల ఎంపిక ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు ఇష్టమైన క్రీడల్లో ఆరితేరాలన్నారు. స్టేడియం మైదానంలో ఇచ్చే శిక్షణలో అథ్లెటిక్స్‌తో పాటు మిగతా క్రీడాంశాల్లో దృష్టి సారించాలన్నారు. అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్నంలో నవంబరు 24 నుంచి 26 వరకు 15వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు శ్యాంసన్, సైక్లింగ్ కార్యదర్శి రాజేశ్వర్, ఆనంద్, సాదిఖ్‌అలి, శ్రీనివాస్, రాజు, వి.శ్రీనివాస్, రమణ, మేరిపుష్ప, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## యువజన క్రీడాశాఖల్లో

# ఉన్నతాధికారి తనిఖీలు

ఖమ్మం : యువజన, క్రీడా శాఖ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారి అలీరఫత్ తనిఖీలు నిర్వహించారు. ఖమ్మం వచ్చిన యువజన, క్రీడలు, పర్యాటక శాఖల విజిలెన్స్ విభాగం ముఖ్య పర్యవేక్షణాధికారి అలీరఫత్ ముందుగా జడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని పర్యాటకశాఖ కార్యాలయ పనితీరును పరిశీలించారు.

అనంతరం సర్దార్ పటేల్ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాల యంలో ఇప్పటి వరకు అందిన నిధులు, వాటి వినియోగానికి సంబందించిన దస్త్రాలను పరిశీ లించారు. అనంతరం క్రీడా ప్రాంగణాల నిర్వహ ణ తీరును చూశారు. అనంతరం కొత్తగూడెం బయలుదేరి వెళ్లారు.

అలీరఫత్ గతంలో ఖమ్మం జేసీ, కలెక్టర్‌గా పనిచేశారు. సర్దార్ పటేల్ స్టేడియానికి జవజీవాలు కల్పించిన అధికారిగా ఆయనకు పేరుంది. మైదానానికి వచ్చి క్రీడా కారులతో ఫుట్‌బాల్ ఆడిన అనుభవం, ఫుట్‌బాల్ రంగంతో అనుబంధం ఉన్న అధికారి కావడంతో అధికారి వచ్చిన విషయం తెలుసుకున్న క్రీడా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు.

తమ శాఖ పరిధిలోని పర్యాటకం, యువజన విభాగం, క్రీడాశాఖ విభాగాల కార్యాలయాల పనితీరు, అక్కడి జమా ఖర్చులను అలీరఫత్ పరిశీలించారు. అధికారి ఆకస్మిక పర్యటనకు వచ్చి తమ పనిలో ఉండగా ఎవరికి తోచిన సమస్యలు వారు చెబుతూ అధికారినే పరిష్కారం కోరే వారి సంఖ్య ఎక్కువగా కనిపించింది. కొందరు ఉద్యోగులు తమ జీతభత్యాలు పెంచాలని, మరికొందరు తమ క్రీడాంశానికి చెందిన శిక్షకులను నియమించాలని వినతి పత్రాలు సిద్ధం చేసుకొని అధికారి ఎదుట నిలిచారు. అప్పటికీ అధికారి ఓపిగ్గా అందరికీ సమాధానం చెప్పారు. ఈ శాఖల్లో ఒక అధికారి సార్ విలేకర్ల సమావేశం పెట్టమంటారా అని అడగగా అధికారి కొంత అసహనం చెందారు. తాను వచ్చింది ఆకస్మిక తనిఖీలకు అని, సమావేశాలు పెట్టి ప్రసంగించమంటే ఎలా అనడంతో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది వెనక్కుతగ్గారు.

# భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యం

**కలెక్టర్ డాక్టర్ శరత్**

జగిత్యాల : జిల్లాలో వివిధ భూ వివాద గ్రామాలే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ ఆదేశించారు. జిల్లాలోని తహసీల్దార్లతో దృశ్యమాద్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని, ఈ ప్రక్రియ పూర్తయిన గ్రామాలకు సంబంధించి అన్ని వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. చట్టబద్ధత లేని అసైన్డ్ భూములపై నివేదిక సమర్పించాలని, సాదాబైనామాకు సంబంధించి ఇదివరకు వచ్చిన దరఖాస్తు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేసిన దస్త్రాలను రెండోసారి చేయరాదని దస్త్రాల ప్రక్షాళన పూర్తయిన గ్రామాలకు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలనకు వస్తారని చెప్పారు. అన్ని వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు. జిల్లాకు మంజూరైన ఐదు 33 కె.వి. విద్యుత్తు ఉపకేంద్రాలకు స్థల సేకరణ చేసి, సంబంధిత శాఖకు బదలాయించాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ముషారఫ్ ఫారుఖీ, ఆర్డీవో డాక్టర్ నరెందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. చట్టం ఆవిర్భావ దినం సందర్భంగా గురువారం కేకు కోశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలుసుకోవాలని అన్ని కార్యాలయాల్లో సమాచార అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. స.హ. చట్టం కింద కోరిన సమాచారం ఇవ్వకపోతే జిల్లాస్థాయిలో కాదంటే రాష్ట్రస్థాయి కమిషన్‌కు దరఖాస్తు చేసి, పొందవచ్చని జిల్లాల్లో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చట్టం ప్రతినిధులు టి.శ్రీనివాస్, జి.చంద్రశేఖర్, వి.శంకరయ్య, నాగరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల స్థల సేకరణతోనే కాలయాపన

**- మోత్కుపల్లి**

రాజపేట : ప్రాజెక్టుల నిర్మాణాలకు స్థలసేకరణతోనే మూడున్నరేళ్లు గడిచిపోయాయని, కోటి ఎకరాల సాగు ఎలా చేపడతారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు, రాష్ట్ర రైతువిభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వారు రాజపేటలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, అధికార ప్రతినిధి విద్యాసాగర్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు స్థలసేకరణే పూర్తికాలేదన్నారు. అలాంటిది గందమల్ల, బస్వాపురం ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడు..? ఈప్రాంతాలకు సాగు జలాలు అందేదెన్నడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా అవినీత మయంగా మారిందన్నారు.

ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు సాగునీటి సాధనకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. తపాసుపల్లి జలాశయం నుంచి రాజపేట, ఆలేరు మండలాలకు సాగునీటిని అందించాలనే డిమాండ్‌తో తెదేపా ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా రాజపేటలో చేపడుతున్న రిలేదీక్షలో పాల్గొన్నవారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప జేశారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి నేతృత్వంలో ఈదీక్ష జరిగింది. ఈ సందర్భంగా ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా సాధన, ఆలేరు రైల్వేగేటు ఏర్పాటు ఘనత తనదేనన్నారు. అదే స్ఫూర్తితో తపాసుపల్లి నుంచి నియోజకవర్గానికి నీటిని రప్పించేందుకు ఐక్యంగా కదలి రావాలన్నారు. ఎడారిగా మారుతున్న ఆలేరు ప్రాంతాన్ని వదిలి రూ.50 కోట్లతో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు తమ నియోజకవర్గాలకు నీటిని తరలించుకు పోవడం దుర్మార్గమన్నారు. రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణాల కొరకు భూసర్వేల పేరుతో కాలయాపన చేపడుతుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. జనగామ, ఆలేరు ఎమ్మెల్యేలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అక్రమ సంపాదనకే మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి మాట్లాడుతూ రైతుల కడుపు మండి ఆవేదనతో చేపడుతున్న నిరసనలను తెరాస శ్రేణులు తక్కువ చేసి మాట్లాడటం తగదన్నారు. తపాసుపల్లి జలాశయం నుంచి ఈప్రాంతానికి నీటిని రప్పించేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ దీక్షకు సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, తెలంగాణ పరిరక్షణకు సమితి అధ్యక్షుడు కె.రామచంద్రారెడ్డి, తెదేపా ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు బీల్యా నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐలయ్య యాదవ్, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వి.అశోక్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మీ, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య, కాంగ్రెస్, భాజపా మండల అధ్యక్షులు ఎన్.మహేందర్‌గౌడ్, కాయితి బాల్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు జెల్ల భిక్షపతి, జశ్వంత్, గిరిరాజు వెంకటయ్య, సత్యనారయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు సంస్కరణలు

**- ఉప ముఖ్యమంత్రి కడియం**




బోధన్ పట్టణం : ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రమాణాలు పెంచడానికే సంస్కరణలు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన జూనియర్ కళాశాల నూతన భవనం ప్రారంభోత్సవం, రూ.3 కోట్లతో నిర్మించనున్న ఉర్దూ డిగ్రీ కళాశాల భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కవితతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు విద్యను ప్రాధాన్య అంశంగా తీసుకోకపోవడంతో విద్యా వ్యవస్థలో ప్రమాణాలు తగ్గిపోయి మానవ వనరుల సూచీ దయనీయంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత మూడేళ్లలో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. అందులో భాగంగా వివిధ వనరుల్లో అందుబాటులో ఉన్న రూ.2 వేల కోట్ల నిధులను సమీకరించుకుని విద్యాలయాల్లో కనీస వసతుల కల్పనకు వెచ్చిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడిగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేశాయే గానీ వాటికి కనీస స్థలం చూపడం, భవనాల నిర్మాణం, అధ్యాపకులను కేటాయిం చలేకపోయాయని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించడంపైనే కేసీఆర్ దృష్టి సారించారని తెలిపారు. ఇప్పటికే ఏ రాష్ట్రం చేయలేని విధంగా 521 గురుకులా లు నెలకొల్పినట్లు వెల్లడించారు. ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కోర్టు తీర్పు అడ్డురావడంతో వారు చేస్తున్న పనికి సరిపడా వేతనం ఇవ్వడానికి సర్కారు ముందుకొచ్చిందన్నారు.

బోధన్ జూనియర్, డిగ్రీ కళాశాలకు అందుబాటులో ఉన్న 15.5 ఎకరాల స్థలంలో ఎడ్యుకేషన్ హబ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్థానిక ఎమ్మెల్యే షకీల్‌కు సూచించారు. తాను ఇక్కడ పనిచేసిన 1975-76లో ఈ మైదానం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందన్నారు. ఇప్పటికైనా ఇక్కడ ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని వస్తే విద్యాశాఖ నుంచి నిధులు కేటాయిస్తామన్నారు.



# ఆరోగ్యం



## సుఖ సంతోషాలే ఆయుష్కారకాలు

ఆయుష్షును పెంచుకునేందుకు సంతోషంగా ఉండటమేనని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విషయం నమ్మవచ్చుంటారా...!నిజమేనని చెబుతున్నారు మానసిక వైద్యనిపుణులు. ఎవరైతే ఆనందంగా తమ జీవితాన్ని గడుపుతుంటారో అలాంటివారి ఆయుష్షు ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ఈ మధ్య జరిపిన పరిశోధనల్లో పై విషయం వెల్లడైందని పరిశోధకులు పేర్కొన్నారు. కాబట్టి ఆయుష్షును పెంచుకోవడానికి మందులు, మాకులు అవసరం లేదని వైద్యులు తెలిపారు. కేవలం హాయిగా జీవితాన్ని గడపడం వస్తే చాలంటున్నారు మానసిక వైద్యనిపుణులు.

దీనికి చేయాల్సిందల్లా ఒక్కటే..అదేంటంటే...జీవితంలో ప్రతి చిన్న సమస్య వచ్చినాకూడా దానిని పెద్ద భూతద్దంలో చూసి చలించకూడదంటున్నారు మానసిక, ఆరోగ్య వైద్య నిపుణులు. జీవితంలో ఒడిదుడుకులు సహజమే. అలాగని ప్రతి చిన్న విషయానికి తల్లడిల్లిపోవాల్సిన అవసరం లేదంటున్నారు.

జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు వాటిని సానుకూలంగా పరిష్కరించుకోవాలి. ఎవరైతే తమ జీవితంలో వచ్చే సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోగలుగుతారో అలాంటి వారి ఆయుష్షు ఎక్కువగా ఉంటుందని, వారు జీవితంలో అనుకున్నది సాధించగలరని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


మనిషిలో అరిషడ్వర్గాలు అనేటివి సహజంగా ఉండే లక్షణాలు. వీటిలో ఈర్ష్య అనే గుణం మనిషిలోని ఆయుష్షును క్షీణింపజేస్తుంది. దీంతో మనిషి త్వరగా మృత్యువుకు దగ్గరవుతుంటాడు. ఇప్పటివరకైతే కేవలం మనిషి ఆయుష్షుకు సుఖం అనేదిమాత్రం ఇదమిద్ధంగాచెప్పలేమంటున్నారు వైద్యులు. కాని పరిశోధనల్లో తేలిన విషయాలేమంటే ఎవరైతే సుఖ సంతోషాలతో మానసికంగా ఆనందాన్ని పొందుతుంటారో అలాంటివారు జీవితాంతం ఆరోగ్యంగానూ, ఎక్కువ ఆయుష్షు వరకు జీవిస్తుంటారని మానసిక వైద్యులు తెలిపారు. దీనికి చేయాల్సిందల్లా ఒక్కటే ...సానుకూల దృక్పథం(పాజిటివ్ థింకింగ్)తో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి.

మానసికంగా ఎవరైతే ఆనందంగా ఉంటారో, అలాంటివారు ఎక్కువ కాలం జీవిస్తారని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రజ్ఞుడు డాక్టర్. హావర్డ్ ఎస్. ఫ్రైడ్ తెలిపారు. దీనికి ఆయన ఉదహరిస్తూ... మనో విశ్లేషణ సిద్ధాంతాలను రూపొందించిన సిగ్మండ్ ఫ్రాయిడ్ గురించి తెలియనివారంటూ ఉండరు. అలాంటి వ్యక్తి తన జీవిత కాలంలో సంతోషంగా గడిపినందులకే ఎక్కువ కాలం జీవించారని ఆయన తెలిపారు.

660మందిపై పరిశోధన చేసిన వారిని ప్రశ్నిస్తే వారి సమాధానం ఏంటంటే.. వారు చిన్నప్పుడు ఎంత ఆనందంగా ఉన్నారో...ఇప్పుడుకూడా అంతే ఆనందంగా తమ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపినట్లు పరిశోధనలో తేలిందని ఆయన వివరించారు. తమ వయసు ముదిరేకొద్దీ చాలా సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నామని వారు సమాధానమిచ్చినట్లు ఫ్రైడ్ తెలిపారు. నిరాశతో జీవితాన్ని గడిపేవారిలో రక్తపోటు సమస్య అధికంగా కనపడుతుంటుందని, నియమానుసారం ఆహారం తీసుకోకపోవడంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతుంది. ఇలా నాలుగు సంవత్సరాలు జరిగితే మృత్యువుకు దగ్గరలోనే ఉన్నట్లు భావించాలని వైద్య నిపుణులు తెలిపారు.

కాబట్టి ఇలాంటి వారు తమ శరీర బరవుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్నారు వైద్యులు. అలాగే ధూమపానం, మద్యపానం చేయకుండా నియమానుసారం వ్యాయామంతో బాటు ఆహారం కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## క్యాన్సర్‌ను నిరోధించడం ఎలా?



క్యాన్సర్ మానవులు మరణానికి ప్రధాన కారణాలలో ఒకటి. క్యాన్సర్ వ్యాధి వస్తే ప్రాణాలు పోవడం ఖాయమనే భావన చాలామందిలో ఉంది. అయితే వ్యాధిని ముందుగా గుర్తిస్తే దాని నుంచి బయటపడటం సాధ్యమేనని అంటున్నారు వైద్యులు. క్యాన్సర్ అంటే ఒకప్పుడు చికిత్సే లేని రాచపుండు. కానీ ఇప్పుడు క్యాన్సర్ గురించి అంతగా భయపడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. చిన్నపాటి జాగ్రత్తలతో అసలు రాకుండా కూడా నివారించడం సాధ్యమే అవుతుంది. సిగట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం, మద్యం తీసుకోవడం మానేయడం, మంచి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకుంటే క్యాన్సర్ రిస్కు ఎంత ఉన్నా దాన్ని చాలావరకు జయించినట్టే. వంశంలో ఎవరైనా క్యాన్సర్ పేషెంట్లు ఉన్నవాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకోవడంతో పాటు అవసరమైన పరీక్షలు చేయించుకుంటే ఒకవేళ క్యాన్సర్ ఉన్నా మొదట్లోనే దాని మూలంతో సహా పెకిలించడం సాధ్యం అవుతుంది. క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే అంత సులువుగా నయం చేయవచ్చన్నది మరువకూడదు.

**1. బ్రోకలీ తినండి:** బ్రోకలీ క్యాన్సర్ నిరోధించడానికి సమర్థవంతంగా పనిచేసే సూపర్ ఫుడ్స్ లో ఇది ఒకటి. దాని ఖ్‌అఝుతీఎఅఅశీ-స్త్రవఅఙఎ నాశనం అయినప్పటికీ, ఇది మైక్రోవేవ్ బ్రోకలీ సిఫార్సు లేదు. ఉడికించి లేదా ఆవిరి పట్టించి తినడం వల్ల ఆరోగ్యానికి మంచిది.

**2. మీ మీల్స్ వెల్లుల్లి జోడించండి:** వెల్లుల్లి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణములను కలిగి ఉంది. ఇది రోగనిరోధక వ్యవస్థ బలోపేతం చేస్తుంది మరియు క్యాన్సర్ నివారించడానికి సహాయం చేస్తుంది. అనేక అధ్యయనాలు వెల్లుల్లి విశేషంగా కడుపు క్యాన్సర్ ను నిరోధిస్తుంది.

**3. కొన్ని వ్యాయామాలు:** ఎటువంటి వ్యాయామం లేకుండా, చరుకుదనం లేని జీవన శైలి క్యాన్సర్ కు దారితీస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలోపేతం చేస్తుంది మరియు శరీరం రసాయనాలు, ఎంజైమ్లు మరియు హార్మోన్ల నియంత్రణ సహాయపడుతుంది.

**4. గాఢ నిద్ర:** మానవ శరీరం అన్ని పనులు సరిగ్గా పనిచేయడానికి రోజూ కనీసం 8గంట సమయం నిద్ర అవసరం. రెగ్యులర్ గా సరైన నిద్రవల్ల ఒక ఆరోగ్యకరమైన ఎండోక్రైన్ వ్యవస్థ మరియు క్యాన్సర్ పోరాడేందుకు దాని సామర్థ్యం నిర్వహించడంలో సహాయం చేస్తుంది. ఇది కూడా ఒక ఆరోగ్యకరమైన ఎండోక్రైన్ వ్యవస్థ ప్రోత్సహించడానికి పూర్తి చీకటి లో నిద్ర అవసరం.

**5. ప్రాసెస్డ్ ఫుడ్స్ నివారించండి:** అనేక అధ్యయనాల ప్రకారం ప్రాసెస్ చేసిన ఆహారాలు మరియు చక్కెర గణనీయంగా ఉన్న ఆహారాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని తేలింది. అన్ని హెల్తీ డైయట్ ను తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండి క్యాన్సర్ తో పోరాడా గుణాలు కలిగి ఉంటుంది.

**6. గుడ్డు:** క్యాల్షియం సప్లిమెంట్ తో పాటు విటమిన్ డి. పుష్కలంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల పెద్దగ్రేగు పాలిప్స్ (పెద్ద ప్రేగు క్యాన్సర్) కారకాలను తగ్గిస్తుంది.


**7. నీరు:** మీరు బాత్రూంలో కు వెళ్ళిన ప్రతిసారీ, నీరు ఒక గ్లాసు త్రాగడం వల్ల బ్లాడర్ క్యాన్సర్ నుండి విముక్తి పొందవచ్చుని 1996 లో మెడిసిన్ న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ప్రచురించిన ఒక అధ్యయనం లో ప్రేర్కొనబడినది. ప్రతి రోజు నీటి ఆరు 8-ఔన్సు గ్లాసెస్ త్రాగే పురుషుల శరీరంలో పిత్తాశయ క్యాన్సర్ వ ప్రమాదం సన్నగిల్లిందని కనుగొన్నారు. మరొక అధ్యయనంలో మహిళలు 45 శాతం తమ ప్రమాదాన్ని తగ్గించడంలో నీరు బాగా సహాయపడిందని పెద్ద ప్రేగు క్యాన్సర్ బారీ నుండి విముక్తి పొందారని కనుగొనబడింది.

**8. గ్రీన్ టీ:** ఒక టీ అలవాటు పడుతుంది. గ్రీన్ టీ యొక్క వైద్యం శక్తులు వేల సంవత్సరాలుగా ఆసియా విలువ జరిగింది. వెస్ట్ లో, కొత్త పరిశోధన ఇది క్యాన్సర్లు వివిధ అలాగే గుండె వ్యాధి వ్యతిరేకంగా రక్షిస్తుంది చెబుతాడు. కొంతమంది శాస్త్రవేత్తలు EGCG అని గ్రీన్ టీ లో ఒక రసాయన ఎప్పుడూ కనుగొన్నారు అత్యంత శక్తివంతమైన anticance కాంపౌండ్స్ ఒకటిగా ఉంటుంది భావిస్తున్నారు.

**9. చేపలు:** ఆస్ట్రేలియన్ పరిశోధకల అధ్యయనం ప్రకారం వారానికి రెండు మూడు సార్లు చేపలు తిన్న వారికి దాదాపు రక్త క్యాన్సర్, మైలోమా, మరియు హాడ్జికిన్స్ లింఫోమా అభివృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఇతర అధ్యయనాల ప్రకారం మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ యొక్క ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**10. అధిక క్రొవ్వులను తగ్గించండి:** అధిక కొవ్వు జంతు ప్రోటీన్ తగ్గించి ఆలివ్స్ ను తీసుకోవడం ఉత్తమం. అధిక క్రొవుఉన్న మాసాంహారం తిన్నమహిళల్లో హాడ్జికిన్స్ లింఫోమా అభివృద్ధి చెంది 70 శాతం మందిలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉందని కనుగొన్నారు. కాబట్టి, తక్కువ కొవ్వు ఉన్నది తినడం మంచిది. క్రొవ్వు అదికంగా ఉండే జంతు మాంసం తినడం కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పులు తినడం, ఆలివ్ నూనె వాడడం చాలా ఆరోగ్యకరం.

## గుండెదడగా ఉందా...? అయితే ఇవి తినండి...



సాధారణంగా గుండె యొక్క స్పందనలను మనం గుర్తించలేము. గుండె దడను ఇంగ్లీష్ లో పాల్పిటేషన్స్ అని వ్యవహరిస్తారు. గుండె దడ అనగా తన గుండె తనలో వేగముగా కొట్టుకొంటున్నట్లు తోచుట. సాధారణంగా ఆందోళనగా ఉన్నప్పుడు, వ్యాయామం తరువాత కొందరిలో ఇది కొంతసేపు ఉంటుంది. గుండెదడ చాలాకాలంగా నిరంతరంగా కొనసాగేటట్లయితే దానివలన వచ్చే వ్యాధుల గురించి ఆలోచించాలి. వైద్యులను సంప్రదించి, మొదటి దశలోనే తగిన చికిత్స చేయించుకోవాలి. గుండెదడకు కారణాలు పరిశీలించండి. 1. మానసిక ఒత్తిడి: మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైన సమయంలో గుండెదడ వస్తుంది. 2. రక్తహీనత: దీనివలన శరీర కణజాలానికి ప్రాణవాయువు సరఫరా తగ్గి, దానిమూలంగా ఆయాసం, గుండెదడ వస్తాయి. ముఖ్యంగా అధిక శ్రమ చేసినప్పుడు వీటిలో గుండెనొప్పి కూడా వచ్చే అవకాశం వుంటుంది. 3. విటమిన్ లోపాలు: విటమిన్ బి లోపం వల్ల వచ్చే బెరిబెరి అనే వ్యాధిలో కూడా గుండెదడ రావచ్చు. 4. థైరాయిడ్ గ్రంధి వ్యాధులు: థైరాయిడ్ గ్రంధి ఎక్కువగా పనిచేసే హైపర్ థైరాయిడిజం లో అనూహ్యమైన రీతిలో బరువు తగ్గి, విరేచనాలు, ఆకలి ఎక్కువగా వేయడం, గుండెదడ కనిపిస్తాయి. 5. మెనోపాజ్ సమస్యలు: కొందరు స్త్రీలలో బహిష్టులాగిపోయే దశలో హార్మోన్ ల విడుదలలో లోపం ఏర్పడడం వలన రక్తప్రసరణ గతి తప్పి గుండెదడ ఏర్పడుతుంది. 6. మందుల దుష్ఫలితాలు: ఉబ్బసం కోసం వాడే కొన్ని మందులు గుండెదడను కలిగించే అవకాశం వుంది. 7. గుండె జబ్బులు: గుండె కవాటాలు వ్యాధిగ్రస్తమవడం, గుండె కండరాలు బలహీనమవడం వంటి స్థితులలో గుండెదడ రావచ్చు ప్రతి రోజూ క్రమం తప్పకుండా కొంత సేపు నడుస్తుంటే.. గుండె ఆరోగ్యముగా పనిచేస్తుందని వైద్య నిపుణులు చెబుతుంటారు. కేవలం నడక మాత్రమే కాదు. ఆహారంలో చేసుకునే చిన్న చిన్న మార్పులు కూడా గుండెను ఆరోగ్యముగా ఉంచేందుకు తోడ్పడతాయి. ఆలాంటివే ఈ జాగ్రతలన్ని. వీటిల్లో కనీసం కొన్నింటినైనా ఆచరించగలిగితే మీకు మీరు మేలు సుకున్నవారవుతారు.




**నిమ్మరసం :** గ్లాస్ గోరువెచ్చని నీటిలో మూడు చెంచాల తేనె, నిమ్మరసం వేసుకొని పరగడుపున తాగితే శరీరంలోని మలినాలన్నీ వెలుపలకి వచ్చేస్తాయని పెద్దవాళ్ళు చెబుతుంటారు.

ఇలా చేయడం వల్ల గుండెకు లాభం చేకూరుతుంది. గుండె ఆరోగ్యముగా, పటిష్టంగా ఉంచడంలో తేనె దివ్యఅవుశుధంలగా పనిచేస్తుంది.

కాబట్టి ఇకనుంచైనా తేనె కలిపిన నిమ్మరసాన్ని రోజు తప్పనిసరిగా తాగడం అలవాటు చేసుకోండి.




***యాలకులు:*** యాలకుల పొడి వేసిన టీ తాగుతున్న కూడా గుండెదడ తగ్గుతుంది



**ద్రాక్ష:** గుండెదడను దూరం చేయడంలో ద్రాక్షకు తిరుగులేదు. వీటిలోని పాలీఫేనాల్స్ అందుకు కారణం. అలాగే.. నల్లద్రక్షను కార్డియో ప్రొఎక్టర్స్ అంటాం. ఇవి బ్లడ్ గడ్డ కట్టకుండా కాపాడుతాయి. ద్రాక్ష లభించే కాలంలో ఎక్కువుగా తీసుకూవడం మర్చిపోకండి.



**బొప్పాయి:** గుండె ఆరోగ్యానికి మేలుచేసే మరో పండు బొప్పాయి. రోజు పరగడుపున చిన్న బొప్పాయి ముక్క తీసుకొని చూడండి ఎంతో మార్పూ కనిపిస్తింది.



***వెల్లుల్లి:*** గుండె చుట్టూ కొవ్వు చేరకుండా నివారించడంలో వెల్లుల్లి భాగా పనిచేస్తుంది. అందుకే రోజు అర టేబుల్ స్పూన్ వెల్లుల్లి పొడిని తప్పనిసరిగా తీసుకోవాలి. దీన్ని ఇష్టపడని వారు ఆహారం లో వెల్లుల్లి చేర్చుకుంటే సరిపోతుంది.



***హెర్బల్ టీ:*** వారంలో కనీసం రెండు, మూడు సార్లు అయిన హెర్బల్ టీ తాగాలి. ఎందుకంటె.. ఈ టీ లో కేఫినే ఉండదు కాబట్టి గుండెకు మేలు చేస్తుంది.

## బ్రౌన్ రైస్ తింటే బరువు తగ్గడం కాయం...!

దక్షిణ భారతదేశంలో ప్రధానంగా ఆంధ్రదేశంలో సాధారణంగా అందరూ తినే ముఖ్యమైన ఆహారం అన్నం. ప్రతి రోజూ తినే అన్నం గురించి, దానికోసం వాడే బియ్యం గురించి ఆలోచించం మనం. అంటే దానిలోని పోషక విలువల గురించీ ఆలోచించం. సాధారనంగా అందరూ ఆలోచించేది అన్నం అందంగా, తెల్లగా, విడివిడిలాడుతూ కనబడుతోందా లేదా అని మాత్రమే. అయితే కంటికి ఇంపుగా అన్నాన్ని తయారుచేస్తే అందులో ఉన్న పోషక విలువలు పోతున్నాయి. బ్రౌన్ రైస్ (దంపుడు బియ్యం)తో వండిన అన్నం కంటికి ఇంపుగా ఉండదు.కానీ ఒంటికి మాత్రం ఖచ్చితంగా మంచిది. బియ్యాన్ని పాలిష్ చేసి, ఆకర్షణీయంగా చేసే పద్ధతిలో అందులోని జీవ పదార్థం, ఆరోగ్య రక్షణకి ఎంతగానో అవసరమైన బీ-కాంప్లెక్స్ విటమిన్లు పోతున్నాయి. అయితే కావాలని కోరుకున్నా, ఇప్పుడు పట్టణాలలో దంపుడు బియ్యం కనపడ్డం కష్టం. పాలిష్ చెయ్యని గోధుమలతో తయారైన బ్రౌన్ బ్రెడ్ మాత్రం దొరుకుతోంది. దాని విలువని ప్రజలు గుర్తిస్తున్నారు.


పెద్ద ప్రేగు క్యాన్సర్ నుండి రక్షణ కల్పిస్తుంది : గోధుమరంగు బియ్యంలో ఉన్న సెలీనియం పెద్ద ప్రేగు క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుందని తెలుస్తుంది. బియ్యంలో పెద్ద మొత్తంలో ఉన్న పీచు జీర్ణవాహికలో క్యాన్సర్ కారక రసాయనాల బయటకు పంపుతుంది, ఈ రకంగా పెద్ద ప్రేగు క్యాన్సర్ నుండి కాపాడుతుంది. **రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది** : గోధుమ రంగు బియ్యంలో ఉండే ఫైటోన్యూట్రిఎంట్ లిగ్నాన్ రొమ్ము క్యాన్సర్, గుండెజబ్బులను అడ్డుకోవడంలో సహయపడుతుంది. వయసు మళ్ళిన మహిళలపై జరిపిన అధ్యయనంలో బ్రౌన్ రైస్ వంటి ధాన్యాహారాన్ని తినడం వలన ఎంటరోల్యాక్టోన్ స్థాయిని పెంచుతుందని, దీని వలన రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువని తెలుస్తుంది. కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది : బ్రౌన్ రైస్ ఊకలో లభ్యమయ్యే నూనె కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుందని పేరు పొందింది. బ్రౌన్ రైస్ లో ఉండే పీచు కూడా ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది.

**గుండె జబ్బుల నుండి రక్షిస్తుంది** : పీచు సమృద్ధిగా ఉండటం వలన బ్రౌన్ రైస్ గుండె జబ్బులు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. టెంపుల్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు బ్రౌన్ రైస్ తిన్నందున రక్తపోటును తగ్గించటంతో పాటుగా ధమనులలో ఫలకం చేరే స్థాయిని తగ్గించి, గుండె జబ్బులు వృద్ధి చెందకుండా కాపాడుతుందని కనుగొన్నారు. శరీర బరువును సాధారణంగా ఉంచుతుంది : బ్రౌన్ రైస్ లో పీచు సమృద్ధిగా ఉన్నందున, మీరు అదనపు క్యాలరీలు తీసుకోకుండా చూడటమే కాక ఎక్కువసేపు నిండుగా ఉన్నట్లుగా అనిపించేట్టుగా చేసి ఎక్కువగా తినే అవకాశాలను తగ్గిస్తుంది. హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనాలలో తేలిందేమిటంటే పీచు ఎక్కువగా ఉండే బియ్యం తినే మహిళల శరీర బరువు దాదాపుగా సాధారణంగా ఉంటుంది.

**మలబద్ధకాన్ని నివారిస్తుంది** : పీచు సమృద్ధిగా ఉన్నందున జీర్ణవ్యవస్థకు బ్రౌన్ రైస్ ఎంతో ప్రయోజనకారి. ఇది ప్రేగులలో ఆరోగ్యకర కదలికలను ప్రోత్సహించి మలబద్ధకాన్ని నివారిస్తుంది.

రక్తంలో చక్కరను నియంత్రిస్తుంది : బ్రౌన్ రైస్ లో ఉన్న పీచు రక్తంలో చక్కర స్థాయిని నియంత్రించి టైపు 2 రకం డయాబెటిస్ ను నిర్వహించడంలో సహాయం చేస్తుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని వృద్ధి చేస్తుంది** : ఎముకల ఆరోగ్యాన్ని నిర్వహించడానికి అవసరమైన మెగ్నీషియం బ్రౌన్ రైస్ లో సమృద్ధిగా ఉంది. ఒక కప్పు బ్రౌన్ రైస్ లో దాదాపు 21% మెగ్నీషియం దొరుకుతుంది. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి, వేరొక అత్యవసర పోషకం కాల్షియంను గ్రహించడానికి కూడా అవసరం.



# చిత్రభాను



# రాజుగారిగది 2

## రివ్యూ

అగ్ర తారలు నాగార్జున, సమంత తొలిసారి ఓ హారర్ కామెడీ కథలో నటించడం.. విజయవంతమైన రాజుగారి గదిని సిరీస్‌గా మార్చిన చిత్రం కావడం.. పెళ్లి తర్వాత విడుదలవుతున్న సమంత తొలి చిత్రం కూడా ఇదే అవుతుండడంతో రాజుగారి గదిపై ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. ప్రచార చిత్రాలు ఆ ఆసక్తిని, అంచనాల్ని మరింతగా పెంచాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా ఉందా? ఆత్మగా సమంత, మెంటలిస్ట్‌గా నాగార్జున చేసిన సందడి ఎలా ఉంది? దసరా హంగామా తర్వాత వస్తున్నఈ సినిమా బాక్సాఫీసుని ఏమేరకు ప్రభావితం చేయబోతోంది?

కథేంటంటే: అశ్విన్(అశ్విన్), కిశోర్(వెన్నెల కిశోర్), ప్రవీణ్(ప్రవీణ్) మంచి స్నేహితులు. ఇళ్లల్లో ఇబ్బందులున్నా, కష్టాలకు ఓర్చి రాజుగారి రిసార్ట్‌ను కొనుగోలు చేస్తారు. కానీ రిసార్ట్‌లో ఓ దెయ్యం వారిని భయపెడుతుంటుంది. దాంతో ఆ ముగ్గురూ చర్చి ఫాదర్ (నరేశ్)ని సంప్రదిస్తారు. ఆయన సలహాతో మెంటలిస్ట్ రుద్ర(నాగార్జున) రంగంలోకి దిగుతాడు. కళ్లలోకి చూస్తూ మనసులో ఏముందో చెప్పగల సమర్థుడు రుద్ర. పోలీసులు కూడా పలు కేసుల్లో ఆయన సహకారం తీసుకుంటారు. ఫాదర్ కోరిక మేరకు రిసార్ట్‌లోకి అడుగుపెట్టిన రుద్రకు సుహానిస(సీరత్ కపూర్)పై అనుమానం వస్తుంది. ఆ తర్వాత అమ ృత(సమంత) అనే అమ్మాయి ఆత్మ ప్రతీకారం కోరుకుంటుందన్న విషయం తెలుసుకుంటాడు.ఇంతకీ అమ ృత ఎవరు? రాజుగారి రిసార్ట్‌కి ఆమెకి సంబంధం ఏంటి? ఆమె ప్రతీకారం ఎవరిపైన? అమ ృతకి సుహానిసకి బంధం ఏమైనా ఉందా అన్న విషయాలు తెరపై చూడాలి.

ఎలా ఉందంటే?: ఒక ఆత్మ ఆ ఆత్మకి సాయంగా నిలిచిన ఓ మెంటలిస్ట్ కథే ఈ చిత్రం. హారర్ కామెడీ నేపథ్యంతో కూడుకున్న చిత్రమే అయినా, ఓ మంచి సందేశంతో తీర్చి దిద్దారు. ఆరంభ సన్నివేశాలు సాదాసీదాగానే అనిపించినా, దెయ్యం భయపెట్టడంతోనే కథ వూపందుకుంటుంది. తొలి సగ భాగం సన్నివేశాలు చాలా వరకు కిశోర్, అశ్విన్, ప్రవీణ్ త్రయంపైనే హస్య ప్రధానంగా సాగుతాయి.

హారర్ నేపథ్యం ఉన్నా, కేవలం కొన్ని సన్నివేశాలు మాత్రమే భయపెడతాయి. నాగార్జున పాత్ర ప్రవేశంతో కథ మరింత వేగం పుంజుకుంటుంది. ఆయన ఓ కేసు చిక్కుముడిని విప్పే విధానం ఆసక్తికరంగా అనిపిస్తుంది. ద్వితీయార్థం సినిమాకి ప్రధాన బలం. అమ ృత పాత్ర, ఆమె నేపథ్యం కుటుంబ ప్రేక్షకులను సైతం ఆకట్టుకునేలా ఉన్నాయి. పతాక సన్నివేశాలు సినిమాకు ప్రాణం పోశాయని చెప్పొచ్చు. మహిళలకి రక్షణ, జీవితం అంటే ఏమిటి? అనే విషయాలపై సందేశం హ ృదయానికి హత్తుకుంటుంది. నాగార్జున.. సమంత మధ్య వచ్చే చివరి 20 నిమిషాల సన్నివేశాలు, సంభాషణలు బాగున్నాయి. కిరణ్ అనే పాత్రలో అభినయ నటన ఆకట్టుకుంటుంది. నాగార్జున, సమంతలాంటి స్టార్ల స్థాయికి తగ్గ చిత్రం ఇది. కాకపోతే తొలి సగ భాగం సన్నివేశాల్లో వినోదంపై మరింత కసరత్తు చేస్తే బాగుండేది. కుటుంబం సమేతంగా చూసే చిత్రంగా దర్శకుడు దీన్ని తీర్చిదిద్దాడు. ప్రేక్షకులకు నచ్చే అంశాలు పుష్కలంగా ఉండటంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎవరెలా చేశారంటే..: నాగార్జున మోడ్రన్ సెయింట్ రుద్ర పాత్రలో ఇమిడిపోయారు. హావభావాలతోనూ తన డైలాగ్ స్టైల్‌తోనూ హీరోయిజాన్ని పండించారు. సమంత, లా చదువుకున్న అమ్మాయిగా చక్కగా నటించింది. నటీనటులు కొత్త పాత్రల్లో కనిపిస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందో సినిమాలో నాగార్జున.. సమంత పాత్రలే చెబుతాయి. సీరత్ అందాల ఆరబోత కాస్త శ్రుతి మించినా, ఆమె పాత్రకీ ప్రాధాన్యం ఉంది. చాలా సన్నివేశాల్లో ముఖకవళికలతోనే సన్నివేశాలను రక్తికట్టించింది. అభినయ నటన పతాక సన్నివేశాలకు ప్రధాన బలం.

సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ద్వితీయార్థంలో అబ్బూరి రవి కలం పదును స్పష్టంగా తెలుస్తుంది. తమన్ సంగీతం, దివాకరన్ కెమెరా పనితనం బాగా కుదిరింది. రాజుగారి గది సాధించిన విజయాన్ని నిలబెట్టుకోవాలనే కసితో పనిచేశాడు ఓంకార్. నిర్మాణ విలువలు, విజువల్ ఎఫెక్ట్స్ బాగున్నాయి.

---

# వేసవిలో కోలీవుడ్ ఎంట్రీ!



అల్లు అర్జున్ కథానాయకుడిగా లింగుస్వామి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా తెరకెక్కబోతున్నట్లు ఏడాది క్రితం ప్రకటన వెలువడింది. డీజేదువ్వాడ జగన్నాథం తర్వాత అల్లు అర్జున్ ఈ ద్విభాషా చిత్రాన్ని మొదలుపెడతారని అంతా ఆశించారు. కానీ ఆయన నా పేరు సూర్య చిత్రీకరణతో బిజీగా మారిపోయారు. మరోవైపు దర్శకుడు లింగుస్వామి తమిళంలో విశాల్ కథానాయకుడిగా సందకోజి-2 (పందెంకోడి-2) చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకొచ్చారు. దాంతో అల్లు అర్జున్ సినిమాపై అనుమానాలొచ్చాయి. సినిమా ఆగిపోయిందంటూ ప్రచారం జరిగింది. తాజా సమాచారం ప్రకారం 2018 వేసవిలో ఈ సినిమా మొదలుకానున్నట్లు తెలిసింది. అల్లు అర్జున్ ఇమేజ్‌కు సరిపోయేలా దర్శకుడు లింగుస్వామి ఓ అదుతేమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇటీవలే పూర్వ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిసింది. వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో సినిమాను సెట్స్‌పైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాతో అల్లు అర్జున్ కోలీవుడ్‌లో అరంగేట్రం చేయనుండటం విశేషం.



# పూజా హెగ్డేను చూస్తే మతిపోవడం ఖాయం..

దక్షిణాదితోపాటు బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో తన గ్లామర్‌తో ఆకట్టుకొంటున్న పూజా హెగ్డే జన్మదినం అక్టోబర్ 13. తన పుట్టిన రోజును పురస్కరించుకొని ఇటీవల కొన్ని ఫొటోలను తన సోషల్ మీడియాలోని ఇన్‌స్టాగ్రామ్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసింది. తన జన్మదినం రోజున శుభాకాంక్షలు చెబుతూ తెలు మహెంజదారో చిత్రంలో బాలీవుడ్ కండల వీరుడు హ ృతిక్ రోషన్ పక్కన మెరిసిన పూజాహెగ్డేకు ఇది 27వ జన్మదినం మహెంజదారో చిత్రంలో బాలీవుడ్ కండల వీరుడు హ ృతిక్ రోషన్ పక్కన మెరిసిన పూజాహెగ్డేకు ఇది 27వ జన్మదినం డీజే తర్వాత తన తదుపరి చిత్రం కోసం పోరాటాలు, ఫైట్స్‌కు సంబంధించిన శిక్షణ పొందుతున్నారు. పూజా హెగ్డే 1990లో ముంబైలో జన్మించింది. కామర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 2009లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నది. ఈ పోటీలలో మిస్ ఇండియా టాలెంటెడ్ టైటిల్‌ను గెలుచుకొన్నది. బాలీవుడ్ చిత్రం రేస్3లోనూ నటించే అవకాశాన్ని దక్కించుకొన్నది. తమిళంలో వేటగాడు సినిమాలో కూడా కనిపించనున్నారు.



# ముఖ చిత్ర సుందరి

తెలుగు సినిమాలతో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది తాప్సీ. తమిళంతో పాటు దక్షిణాది భాషలన్నింటిలో సినిమాలు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో పేరుప్రఖ్యాతులు దక్కకపోవడంతో బాలీవుడ్ బాట పట్టింది. బేబీ, పింక్ చిత్రాల్లో చక్కటి అభినయంతో ఆకట్టుకున్న ఆమెను హిందీలో పలు అవకాశాలు వరిస్తున్నాయి. దక్షిణాదిలో జరిగిన తప్పులు బాలీవుడ్‌లో పునరావ ృతం కాకుండా జాగ్రత్తపడిన తాప్సీ హిందీలో తొలినాళ్లలో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేసింది. ప్రస్తుతం తన పంథాను మార్చుకునే పనిలో పడింది. గ్లామర్ బాటను పట్టింది. ఇటీవల విడుదలైన జుద్వా-2లో బికినీతో గ్లామరస్‌గా దర్శనమిచ్చి ఆకట్టుకుంది. తాజాగా ఓ మాస పత్రిక కవర్‌పేజీ కోసం మరోసారి మోతాదుకు మించిన అందాల ప్రదర్శన చేసి వార్తల్లో నిలిచింది. బ్లాక్ అండ్ పింక్ కాంబినేషన్ దుస్తులు, రెట్రో హెయిర్‌ట్కస్టైల్‌తో హాట్‌గా కనిపిస్తున్న తాప్సీ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. అందాల ప్రదర్శన విషయంలో తనకు ఎలాంటి హద్దులు లేవని ఈ ఫొటోలతో బాలీవుడ్ కు చాటింది.

# పర్యావరణ దీపావళి




- పటాకులతో వాయు, శబ్ద కాలుష్యం
- పొంచి ఉన్న వ్యాధులు, ప్రమాదాలు
- కాలుష్యం కొనితెచ్చుకుందామా?
- ఆనందాల దీపావళిని జరుపుకుందాం
- స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి
- స్వాతి ప్రమోటర్స్ యండీ రమేష్ రెడ్డి

విశాఖ సిటీ : ఎవరికి వారు సామాజిక బాధ్యతగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తోడ్పాటునందిస్తే అదే పర్యావరణ దీపావళి అని స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి, సంస్థ యండీ రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళిని పర్యావరణ, జల, వాయు కాలుష్య రహితంగా జరుపుకోమనే పురాణేతిహాసాలు పేర్కొన్నాయి గానీ, ఎక్కడా ఏ గ్రంధాలలో కూడా దీపావళి అనగా టపాసులు పేల్చమని కాని, కాలుష్యాన్ని వెదజల్లమని గాని చెప్పలేదని, ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో దీపాలు మాత్రమే వెలిగించి పండగ జరుపుకోవడం అర్థమని దీపావళి నిగూడార్థాన్ని వివరించారు. దీపావళి అనగా దీపముల వరుస అని అర్థము కదా! మరి దీపావళి పండగకు పర్యావరణానికి ప్రతికూలాన్ని కలిగించేలా బాణాసంచా కాల్చడం ఏ పురాణంలో పేర్కొన్నారని భావోద్వేగానికి గురై ప్రశ్నించారు. పురాణాల ప్రకారం నరకాసురుడనే రాక్షసుని సంహరించిన మరుసటి రోజున దీపావళిగా జరుపుకుంటామని కృష్ణారెడ్డి పురాణోక్తిని వచించారు. శ్రీరాముడు లంకలో రావణుని సంహరించి సీతమ్మను అయోధ్యకు తోడ్కొని వచ్చినపుడు ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళిని జరుపుకున్నారని వచించారు. వెలుగు దివ్వెల దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలే గాని పటాకుల మోతతో కాదు అని సూచించారు. కాలుష్యాన్ని వెదజల్లే పటాకుల మోతకు దూరంగా ఉండడం శ్రేయస్కరమని ప్రజలకు హితవు పలికారు. దీని ద్వారా కాలుష్యంలో చాలా రకాలైన ధ్వనికాలుష్యం, జల కాలుష్యం, వాతావరణ కాలుష్యం కలిగి తద్వారా ప్రజలంతా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదని చెప్పారు. దీని ద్వారా సర్వత్రా ఆందోళన కలిగిస్తోందని అన్నారు. పండుగ ముసుగులో కోట్లాది రూపాయలు బాణాసంచాల వ్యాపారం పేరుతో బుగ్గిపాలు జేస్తున్నారే తప్ప దీనివల్ల మానవాళికి ఏవిధమైన ఆనందం కలుగదు సరికదా కాలుష్యాన్ని మరింత పెంచిన వారమౌతామని రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ దీపావళికి దీప లక్ష్మి కిరణాలతో అమావాస్య చీకట్లను పారద్రోలి జగత్తును కాంతి కిరణాలతో నింపుతుందనే భావనతో దీపావళి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంతేకాక దీపావళి పండగ రోజున నువ్వుల నూనెతో తలంటుకొని సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానమాచరించిన గంగా స్నాన ఫలం లభిస్తుందన్నారు. అంతేకాక వ్యాపారస్తులు సాయంత్రం వేళ లక్ష్మీదేవిని పూజించి రాత్రంతా జాగరముండి వారి వారి స్తోమతను బట్టి బంగారు, వెండి నాణాలతో లక్ష్మీదేవిని ప్రత్యేకించి అలంకరించి పూజించినట్లేతే వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని భక్తుల నమ్మకని పేర్కొన్నారు. అలా కాకుండా దీపావళి నాడు క్రాకర్స్ కాల్చడం వలన ధ్వని కాలుష్యం ఏర్పడి బాంబులు, టపాసులు పేలిన శబ్దానికి చిన్నపిల్లలకు, గాని పెద్ద వారికి గాని 125 డెసిబుల్స్ దాటకూడదని, అట్లయిన పక్షంలో చెవుడు, నిద్రసమస్యలు, గుండె సమస్యలు ఒక్కోసారి పూర్తిగా చెవుడు వచ్చే ప్రమాదమూ లేకపోలేదని అన్నారు. ఈ అనర్థం కేవలం మనుషులకే కాకుండా పశు పక్ష్యాదులకు సైతం జరుగుతుందనడంలో సందేహం లేదు. టపాసులు పేల్చే గాలిలో సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మొనాక్సైడ్‌ల తీవ్రత పెరుగుతుందని తెలిపారు. ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో 200 మైక్రో గ్రాములు దాటి కాలుష్య కారకాలైన ధూళి కణాలు అనూహ్యంగా పెరిగి ఫలితంగా శ్వాసకోస వ్యాధులు సైతం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. వీటితోపాటు సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ తదితర మూల కారకాలు మోతాదుని మించి భారీగా పెరగడంతో ముక్కు పుటాలదిరిపోతాయని చెప్పారు. ఇటువంటి ప్రమాదకారకమైన దీపావళిని జరుపుకోవడం ఎంతవరకు సమంజసమో ప్రజలు యావత్తు ఆలోచించి ఆనందోత్సాహల మధ్య పర్యావరణ దీపావళిని జరుపుకోవడం ఎంతైనా శ్రేయోదాయకమని స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి, సంస్థ యండీ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ దీపావళి ప్రత్యేకతను తెలుపుతున్న కరపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు రెజీనా పాఠాలు!



హైదరాబాద్ : ప్రముఖ సినీనటి రెజీనా బంజారాహిల్స్‌లో సందడి చేశారు. ప్రభుత్వ విద్యార్థులతో ఆడిపాడిన వారితో కలిసి ఓ సినిమాను చూశారు. విద్యార్థులకు ఆంగ్ల బోధన చేశారు. సాఫ్ట్‌వేర్ సంస్థ పెగా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెగా టీచ్ ఫర్ ఛేంజ్ కార్యక్రమాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని గతి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఓ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులతో కలిసి ఇన్‌సైడ్ ఔట్ అనే యానిమేషన్ చిత్రాన్ని తిలకించారు. ఆ చిత్రంలోని భావాన్ని విద్యార్థులకు వివరించారు. ఆంగ్లంలో కిటుకులు తెలిపారు. పెగా ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులకు దైనందిన పాఠ్యాంశాల ఆటవిడుపుతో పాటు వారికి ఆంగ్లంపై ఆసక్తికల్పించాలని కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## రానున్న మూడేళ్లలో 10లక్షల సీసీ కెమెరాలు: సీపీ



హైదరాబాద్ : రానున్న మూడేళ్లలో నగరంలో ప్రజల సాయంతో పది లక్షల కెమెరాలు ఏర్పాటు చేస్తామని నగర పోలీసు కమిషనర్ మహేందర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ జయా గార్డెన్‌లో పశ్చిమ మండల పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేను సైతం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీసీ కెమెరాలతో సేకరించిన ప్రమాదాలతో కూడిన లఘు చిత్రం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నగరాన్ని నేరరహితంగా తయారు చేసేందుకు ప్రజల సహకారంతో ఇప్పటి వరకు లక్షకు చాలా దగ్గరలో సీసీ కెమెరాలు బిగించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యం, నేరాల పరిశోధన, కేసుల ఛేదన అంశాలపై పాఠశాలల పిల్లలు వేసిన చిత్రలేఖనాలు పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి, కెమెరాలు స్వచ్ఛందంగా బిగించుకున్న వారికీ జ్ఞాపికలు అందజేశారు.పశ్చిమ మండల డీసీపీ వెంకటేశ్వరరావు, పంజాగుట్ట ఏసీపీ ఎం. వెంకటేశ్వర్లు, బంజారాహిల్స్ ఏసీపీ నోముల మురళీ, ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

## డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలేసి రాజకీయాల్లోకి



కర్ణాటక : కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కూడ్లిగి డీఎస్పీగా 2014 సెప్టెంబర్లో బాధ్యతలు చేపట్టిన అనుపమ షణై అక్రమార్కుల పీచమణిచి, అక్రమ మద్యం వ్యాపారాలపై ఉక్కుపాదం మోపి సంచలనం సృష్టించారు. అక్రమ మద్యం కట్టడి విషయంలో అప్పటి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పరమేశ్వర్ నాయక్తో ఆమె విభేదించారు. దీంతో నేరుగా ఇద్దరూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన ఆమె అక్రమ మద్యాన్ని ప్రోత్సహిస్తోందంటూ మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. దీంతో అనుపమకు భారీ సంఖ్యలో మద్దతు లభించడమే కాదు, ఆమె ధైర్యానికి ఫిదా అయిపోయారు. ఊహించని విధంగా 2016లో ఆమె డీఎస్పీ పదవికి రాజీనామా చేశారు. అనంతరం మౌనంగా ఉన్నారు.

తాజాగా కల్బుర్గిలో తన అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహిళా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను రాజకీయ పార్టీ స్థాపించబోతున్నానని ఆమె ప్రకటించారు. దానికి మహిళల మద్దతు అవసరమని ఆమె పేర్కొన్నారు. రాజకీయ పార్టీలన్నీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తాయి కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేస్తున్నాయని ఆరోపించారు. మహిళల సంక్షేమం గురించి కాంగ్రెస్, బీజేపీలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు.తమ పార్టీలో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని అనుపమ స్పష్టం చేశారు. కర్ణాటకలో 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 అసెంబ్లీ సీట్లు మహిళలకు కేటాయిస్తానని ఆమె ప్రకటించారు. ఎక్కడైతే ఆమె పదవిని వదిలేశారో..అదే కుడ్లిగిలో నవంబర్ 1న బహిరంగ సభ ఏర్పాటు చేసి, పార్టీ ప్రకటన చేయనున్నారు

## కొడుకు అవినీతిపై అమిత్ షా స్పందన



న్యూఢిల్లీ : బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తన కుమారుడు జయ్ షాను సమర్థించారు. తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని ఆయన లబ్ధి పొందినట్లు వచ్చిన ఆరోపణలను ఖండించారు. జయ్ షా వ్యాపార లావాదేవీల్లో అవినీతి ప్రసక్తే లేదన్నారు. ఏదైనా కంపెనీ టర్నోవరు రూ.1 కోటి అయితే, దాని లాభం రూ.1 కోటి అవదని చెప్పారు. తన కుమారుడి కంపెనీ రూ.80 కోట్ల టర్నోవరు సాధించినప్పటికీ రూ.1.5 కోట్ల నష్టానికి గురైందని చెప్పారు. ఈ స్థాయిలో టర్నోవరును సాధించినప్పటికీ లాభాలు రాలేదన్నారు. అన్ని చెల్లింపులు చెక్కుల ద్వారా మాత్రమే జరిగాయన్నారు. మనీలాండరింగ్ ప్రసక్తే లేదన్నారు. తన కుమారుడి కంపెనీకి లైన్ ఆఫ్ క్రెడిట్ ఇచ్చారని, అది అన్ సెక్యూర్డ్ లోన్ కాదని పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో ఓ టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ఈ వివరణ ఇచ్చారు.

## ఇక టెస్టు ఛాంపియన్ షిప్..

### ఐసీసీ గ్రీన్ సిగ్నల్.. ఆడనున్న 9 దేశాలు



వెల్లింగ్టన్: టెస్టులకు మరింత ఆదరణ తీసుకువచ్చేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక ముందడుగు వేసింది. టెస్టు ఛాంపియన్‌షిప్‌కి ఐసీసీ ఆమోదం తెలిపింది. దీంతోపాటు వన్డే ఇంటర్నేషనల్ లీగ్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు 4 రోజుల టెస్టు మ్యాచ్‌ల ప్రయోగాలను ఆయా దేశాలు చేపట్టొచ్చని ఐసీసీ పేర్కొంది.

ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవ్ రిచర్డ్‌సన్ అక్లాండ్‌లో మీడియాతో మాట్లాడారు. 2019 వన్డే ప్రపంచకప్ అనంతరం ఈ టెస్టు ఛాంపియన్‌షిప్ ప్రారంభం అవుతుందని ప్రకటించారు. ఫైనల్‌ను 2021లో నిర్వహిస్తామని చెప్పారు. టెస్టు హోదా కలిగిన 12 దేశాల్లో 9 దేశాలు ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆడతాయని వివరించారు. రెండేళ్లపాటు జరిగే ఛాంపియన్‌షిప్‌లో 9 దేశాలు మొత్తం ఆరు సిరీస్‌లు ఆడుతాయని పేర్కొన్నారు. మూడు సిరీస్‌లు స్వదేశంలో, మరో మూడింటిని బయటిదేశాల్లో ఆడతాయన్నారు. సిరీస్‌లో కనిష్ఠంగా రెండు మ్యాచ్‌లు.. గరిష్ఠంగా ఐదు మ్యాచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. టాప్‌లో నిలిచిన రెండు దేశాలు ఏప్రిల్ 2021లో జరిగే టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో తలపడతాయన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ గురించి కసరత్తు చేయాల్సి ఉందని తెలిపారు. టెస్టు హోదా కలిగిన 12 దేశాల్లో.. జింబాబ్వే, అఫ్గానిస్థాన్, ఐర్లాండ్‌లను ఆరంభంలో మినహాయించినట్లు రిచర్డ్ తెలిపారు. 2021 నుంచి 13 జట్ల వన్డే ఇంటర్నేషనల్ లీగ్‌ను కూడా ప్రవేశపెడతామని చెప్పారు.

### ఫిఫా-17 ఓటమిపై

## కోచ్ విశ్లేషణ



దిల్లీ: స్వదేశంలో జరుగుతున్న ఫిఫా అండర్-17 ప్రపంచకప్‌లో భారత ప్రస్థానం ముగిసింది. పసికూనగా బరిలోకి దిగిన టీమిండియా ఆశించిన దానికన్నా మెరుగ్గానే ఆడింది. ప్రపంచ స్థాయి జట్లతో మరీ ఘోర పరాజయాలు కాకుండా గౌరవప్రదమైన పోరాటంతో ఆకట్టుకుంది. ఘనా చేతిలో 4-0తో ఓటమి తర్వాత భారత కోచ్ లూయిస్ నోర్టాన్ డి మాటోస్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆమ్లెట్లు, బ్యాంకు దోపిడీ వంటి పదాలతో ఆటను విశ్లేషిస్తూ నిజాయతీగా, నిక్కచ్చిగా మాట్లాడటం విశేషం.

### ఈ అనుభవం గొప్పది

గత వారం రోజుల్లో భారత ఫుట్‌బాల్ అనుభవం గురించి లూయిస్ ఎలాంటి కపటం లేకుండా నిర్మొహమాటంగా చెప్పేశారు. ఈ అనుభవం ఐ-లీగ్ కన్నా గొప్పది. ఇండియన్ సూపర్ లీగ్ జట్లు స్పెయిన్‌లో నాలుగో డివిజన్ జట్లతో ఓడిపోతున్నాయి అని పేర్కొన్నారు. జరిగిన మ్యాచ్‌లో ఘనా, భారత్ మధ్య తేడాను విస్పష్టంగా చెప్పారు. మ్యాచ్ ముగిసిన వెంటనే ఘనా ఇంకా ఎనిమిది మ్యాచ్‌లు ఆడగలదు. మనం మరో గేమ్ ఆడలేం. ఇదే ఆట మాల్దీవులు, నేపాల్, భూటాన్‌తో ఆడుంటే మ్యాచ్ మరోలా ఉండేది అని అన్నారు. ఘనా ఆటగాళ్ల ఫిట్‌నెస్ అమోఘం.

అందరూ దుర్బేధ్యంగా ఉన్నారు. వెడల్పాటి ఛాతి, పర్ఫెక్ట్ యాబ్స్‌తో బలంగా ఉన్నారు. అలసటే ఎరగనట్టు కనిపించారు. భారత కుర్రాళ్లు ద్వితీయార్ధంలో బాగా అలసిపోయారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com